Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 172 మేడ్చల్ మల్కాజ్‌గిరి 14 జూలై 2024 గురువారం పేజీలు : 4

## తాండవిస్తున్న నిరుద్యోగం..

ఢిల్లీ: దేశంలో నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో చెప్పే రిపోర్ట్ ఒకటి బయటకి వచ్చింది. ఇంజినీరింగ్ చదువులకు అత్యుత్తమ విద్యాసంస్థలుగా పేరుగాంచిన ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది. ధీరజ్ సింగ్ అనే పూర్వ విద్యార్థి(ఐఐటీ కాన్పూర్) ఐఐటీల్లో నిరుద్యోగంపై గల గణాం కాలను సమాచార హక్కు చట్టం కింద సేకరించాడు. ఈ వివరాలను ధీరజ్ తన లింక్డ్ఇన్ అకౌంట్లో పోస్ట్ చేశాడు. మొత్తంగా 23 ఐఐటీల్లో ప్లేస్‌మెంట్లు చాలా వరకు సంక్షోభంలో కూరుకుపోయాయి. ఈ ఏడాది మే నెల వరకు 23 ఐఐటీలలో 8 వేలకుపైగా విద్యార్థులకు ఉద్యోగాలు లభించలేదు. 2024లో ప్లేస్ మెంట్ల కోసం 21 వేల 500 మంది ఐఐటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 13 వేల 410 మందికి ఉద్యోగాలు లభించాయి. మిగిలిన 38 శాతం (8 వేల 100) మంది నిరుద్యోగులుగానే మిగిలిపోయారు.

# మార్పులు, చేర్పులకు కూడా నోచుకోని వైనం

## సంవత్సరాల తరబడి తప్పని ఎదురు చూపులు...

## గ్యారంటీలకు రేషన్ కార్డు తప్పనిసరి చేసిన యంత్రాంగం

## ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్న పేదలు




**రేషన్ కార్డులు లేక నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. సంవత్సరాల తరబడి కొత్త రేషన్ కార్డులకు నోచుకోక ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలు నోచుకోవడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొత్త రేషన్ కార్డులు వస్తాయని ఆశించిన పేదలకు ఇంకా ఎదురు చూపులు తప్పడం లేదు. అయితే కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీల్లో ఒక్కో హామీ అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నా.. కొత్త రేషన్ కార్డులు జారీ చేసే విషయం మాత్రం ఇంత వరకు స్పష్టత రాలేదు.**

వికారాబాద్ : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల ద్వారా లబ్ధి పొందడానికి రేషన్ కార్డు తప్పనిసరిగా మారింది. రేషన్ కార్డులు ఉన్న పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నా రేషన్ కార్డులు లేని పేదల సంగతేమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీలతో లబ్ధి పొందడానికి అన్ని అర్హతలు ఉన్నా.. రేషన్ కార్డు లేని కారణంగా వేలాది పేద కుటుంబాలు దూరమవుతున్నాయి. జిల్లాలో మొత్తం 2,41,179 రేషన్ కార్డులు ఉండగా, వీటిలో 8,09,218 మంది కుటుంబ సభ్యులు నమోదయ్యారు. ఈ కార్డుల్లో ఆహార భద్రత కార్డులు 2,14,503 ఉండగా, వీటిలో 7,34,077 మంది కుటుంబ సభ్యులు నమోదయ్యారు. అంత్యోదయ ఆహార భద్రత కార్డులు 26,640 ఉండగా, వాటిలో 75,101 మంది నమోదు కాగా, అన్నపూర్ణ అన్న యోజన కార్డులు 36 ఉండగా, వాటిలో 40 మంది నమోదయ్యారు. రేషన్ కార్డుదారులకు యూనిట్ల ఆధారంగా నెలనెలా రేషన్ పంపిణీ చేస్తున్నారు. గత డిసెంబర్ నెలలో ప్రభుత్వం ఆరు గ్యారెంటీల కోసం అందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తే.. ఆరు గ్యారంటీలతో పాటు కొత్త రేషన్ కార్డుల కోసం కూడా చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీల్లో ఒక్కో హామీ అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నా.. కొత్త రేషన్ కార్డులు జారీ చేసే విషయం మాత్రం ఇంత వరకు స్పష్టత రాలేదు.

**తప్పని ఎదురు చూపులు...** కొత్త రేషన్ కార్డులు జారీ చేసే విషయం ఎలా ఉన్నా.. కనీసం ఆ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసేందుకు కూడా అవకాశం లేకపోవడంతో పేదలు నష్టపోతున్నారు. రేషన్ కార్డుపై నమోదైన కుటుంబ సభ్యులకు అదనంగా పేర్లు చేర్చడం, లేదా తొలగించడానికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పించడం లేదు. ఫలితంగా వివాహమైన కుటుంబంలో కొత్తగా చేరిన కోడళ్లు, జన్మించిన పిల్లల పేర్లు రేషన్‌కార్డులో చేర్చాల్సి ఉండగా, వివాహమైన కూతురు, వేరు కాపురం పెట్టిన వారి వివరాలను రేషన్ కార్డులో నుంచి తొలగించాల్సి ఉండగా ఆ అవకాశం లేకుండాపోయింది. ఉద్యోగ రీత్యా లేదా ఇతర కారణాలతో ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయి వేరుగా కాపురం పెట్టిన వారు కొత్త రేషన్ కార్డులకు నోచుకోవడం లేదు. కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగినా ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ పరిమాణంలో మాత్రం మార్పు లేదు. రేషన్ కార్డులో నమోదైన కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగానే రేషన్ సరఫరా చేస్తున్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం లేకపోవడంతో పాత కోటా ప్రకారమే రేషన్ పంపిణీ చేస్తున్నారు.

**26 వేల అభ్యర్థనలు...** గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పుల కోసం ప్రజల నుంచి 26 వేలకు పైగానే అభ్యర్థనలు వచ్చాయి. 2014, డిసెంబరు 31 నుంచి 2024, జూలై 10వ తేదీ వరకు పౌర సరఫరాల శాఖ పోర్టల్‌లో ఈ దరఖాస్తులు నమోదయ్యాయి. రేషన్ కార్డుల్లో పేర్లు తొలగిస్తున్న అధికారులు కొత్త పేర్లను మాత్రం చేర్చకపోవడం గమనార్హం. కూతురు వివాహం కాగానే పుట్టింటి రేషన్ కార్డులో నుంచి ఆ యువతి పేరు తొలగిస్తున్న అధికారులు అత్తింటి వారి రేషన్‌కార్డులో ఆ యువతి పేరు చేర్చడం లేదు. ఫలితంగా పుట్టింటి నుంచి అత్తారింటికి వెళ్లే కోడళ్లకు రేషన్ కోటా మాత్రం దక్కడం లేదు. రేషన్ కార్డుల్లో కొత్తగా నమోదు చేసే చేయాల్సిన ఆప్షన్‌ను ఆన్‌లైన్‌లో లాక్ చేయడంతో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. గత డిసెంబరు నెలలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో కొత్తరేషన్ కార్డుల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని, రేషన్ కార్డులో కొత్తగా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని పేదలు కోరుతున్నారు.




హైదరాబాద్: భారాసకు మరో షాక్ తగిలింది. ఆ పార్టీ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు పలువురు అనుచరులు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో హస్తం పార్టీలో చేరిన భారాస ఎమ్మెల్యేల సంఖ్య 9కి చేరింది. ఇప్పటికే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్, భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకట్రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరారు. అరికెపూడి గాంధీతో పాటు పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు.

శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్.. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

## కలెక్టర్లు, ఎస్పీల మీటింగ్ ఎజెండా ఫిక్స్

## ప్రజాపాలనకు ఫస్ట్ ప్రియార్టీ.. ధరణిపైనా చర్చ

## లా అండ్ ఆర్డర్, డ్రగ్స్ అరికట్టడంపై డిస్కషన్

## విద్య, వైద్యం, వ్యవసాయానికీ ప్రాధాన్యం

## లిస్ట్ వన మహొత్సవం, మహిళాశక్తి క్యాంటీన్ల ఏర్పాటు




హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జూలై 16న సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి తొమ్మిది అంశాలతో కూడిన ఎజెండా ఫిక్సయింది. 24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సమావేశాలకు ప్రాధాన్యత సంతరించుకుంది. తొమ్మిది అంశాలే ఎజెండాగా నిర్వహించబోయే ఈ సమావేశంలో క్షేత్ర స్థాయి పరిస్థితులపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం ఆరా తీయనున్నారు. ఇందులో ప్రజాపాలన దరఖాస్తుల గ్రౌండింగ్, అమలు ప్రస్తుత పరిస్తితిపై చర్చించనున్నారు. దీంతో పాటు ధరణిపై ప్రభుత్వం సబ్ కమిటీ వేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వస్తున్న అభ్యంతరాలు.. వాటికి పరిష్కార మార్గాలపైనా సమావేశం చర్చించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ నడుస్తున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరువుల సమస్యలపైనా డిస్కస్ చేయనున్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైనందున పాఠశాలలు, గురుకులాల్లోని అంశాలపై చర్చ జరగనుంది. సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు, ఎపిడమిక్ సెల్ ల పనితీరు... సర్కారు దవాఖానాల్లో వైద్య సేవల తీరు.. మందుల అందుబాటు తదితర అంశాలపై సీఎం చర్చిస్తారని తెలుస్తోంది. వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్న రేవంత్ సర్కారు ఆరోగ్య శ్రీ పథకం కింద గత ప్రభుత్వ హయాంలో ఉన్న రూ. 5లక్షల సాయాన్ని 10 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. ఆరోగ్య శ్రీ సేవలపైనా సీఎం ఆరా తీయనున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పై ఎస్పీలతో సీఎం చర్చించనున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపైనా ఆరా తీయనున్నారు. ముఖ్యంగా డ్రగ్స్ కంట్రోల్ పై ప్రభుత్వం దృష్టి సారించిన విషయం తెలిసిందే.. వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం ఆరా తీయనున్నారు. రాష్ట్రం నుంచి డ్రగ్స్ మహమ్మారిని తరిమేందుకు ఏం చేయాలనే అంశాన్ని ఎస్పీలతో చర్చించే అవకాశం ఉంది. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నది. అయినప్పటికీ సైబర్ నేరగాళ్లు తమ స్టైల్ ను మార్చి లూటీ చేస్తున్నారు. వీటికి చెక్ పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించే అవకాశం ఉంది. ఏది ఏమైనా బదిలీలు, పదోన్నతుల తర్వాత.. బడ్జెట్ సమావేశాలకు ముందస్తుగా జరుగుతున్న ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది



# సారొస్తారా!?

## 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు...

## ఈసారైనా కేసీఆర్ పాల్గొంటారా ? లేదా?

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 6నెలల పాలనను పూర్తి చేసుకుంది. ఇందులో భాగంగానే ఈ ఆరు నెలల పాలనలో సర్కారు చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేసిన హామీలతో పాటు బడ్జెట్ అంశాలపై చర్చించేందుకు ఈనెల 24 నుంచి అసెంబ్లీ సమావేశాలను నిర్వహిస్తోంది. వారం రోజుల పాటు జరిగే శాసన సభ సమావేశాల్లో 25 లేదా 26న వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఇదే నెలలో 23న కేంద్రప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. అందులో రాష్ట్రానికి కేంద్రం ఇచ్చే నిధులు, కేటాయింపుల ఆధారంగా అసెంబ్లీ సమావేశాల్లో చర్చించే అవకాశం కనిపిస్తోంది. అలాగే రైతుభరోసా, రైతు రుణమాఫీతో పాటు మరికొన్ని అంశాలపై కూడా వాడి వేడి చర్చ జరిగే అవకాశమున్నట్లుగా తెలుస్తోంది.

అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలపై రాష్ట్ర సిఎస్, డిజిపి పలువురు అధికారులతో అసెంబ్లీ స్పీకర్ , శాసన మండలి చైర్మన్ భేటీ అయ్యారు. సమావేశాల తీరు, ఏర్పాట్లపై చర్చించారు.

**వారం రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు..** తెలంగాణ వర్షాకాల అసెంబ్లీ సమావేశాలకు ప్రభుత్వం ముహుర్తం ఫిక్స్ చేసింది. జులై 24 నుంచి వారం రోజుల పాటు సభను నిర్వహించేందుకు స్పీకర్ , శాసనమండలి చైర్మన్ నిర్ణయించారు. అయితే ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో ప్రధానంగా కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి కేటాయింపులు బట్టి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది కాంగ్రెస్ సర్కార్. జులై 25 లేదా 26 న రాష్ట్ర పూర్తి స్థాయి వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది ప్రభుత్వం.

**25న వార్షిక బడ్జెట్..?...** రాష్ట్ర వార్షిక బడ్జెట్ తో పాటు రైతు భరోసా,రైతు రుణమాఫీ అంశాలపై సమావేశాల్లో వాడి వేడి చర్చ జరిగే ఛాన్సుంది. కొత్త ఆర్వోఆర్ చట్టం, తెలంగాణ చిహ్నాం, తెలంగాణ తల్లి విగ్రహం మార్పులపై కూడా చర్చించనున్నారు. అలాగే ఈసమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశ పెట్టనుంది రేవంత్ సర్కార్.

**ప్రశ్నలపై ప్రతిపక్ష పార్టీలు రెడీ..** కాంగ్రెస్ ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత రెండో సారి జరుగుతున్న ఈ అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్ష పార్టీలు బీజేపీ, బీఆర్ఎస్ కూడా అస్త్రశస్త్రాలు సిద్దం చేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలు.. 6 గ్యారెంటీల అమలు,నిరుద్యోగుల ఆందోళన, లా అండ్ ఆర్డర్ అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఈ అసెంబ్లీ సమావేశాలను వేదికగా మార్చుకునే అవకాశం కనిపిస్తోంది.

**పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశంపై..** ప్రజాసమస్యలు, పాలనపరమైన నిర్ణయాలతో పాటు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు, కాంగ్రెస్ పార్టీ చేరికలను ప్రోత్సహించడం వంటి అంశాలపై కూడా కాంగ్రెస్ ను కడిగిపారేసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి.

# సంపాదకీయం

## 2060 నాటికి భారత జనాభాపై ఐరాసా షాకింగ్ నివేదిక!

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. భారత్ తర్వాత స్థానంలో చైనా కొనసాగుతోంది. అయితే ఈ శతాబ్దం మొత్తం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ కొనసాగుతుందని చెబుతూ.. ఫ్యూచర్ లో భారత జానాభాలో కలిగే హెచ్చు తగ్గులపై ఐక్యరాజ్యసమితి ఓ నివేదిక విడుదల చేసింది. అవును... ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురుస్కరించుకుని ఐక్యరాజ్యసమితి "వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ - 2024" పేరిట ఓ నివేదికను విడుదల చేసింది. ఇందులో... 2060 నాటికి భారతదేశ జనాభా 170 కోట్ల వద్ద గరిష్టానికి చేరుతుందని అంచనా వేసింది. అయితే ఆ తర్వాత నుంచి 12శాతం తగ్గుదల రేటుతో క్రమంగా దిగొస్తుందని తెలిపింది. ఇదే సమయంలో వచ్చే 50-60 ఏళ్లలో ప్రపంచ జనాభా 1,030 కోట్లవద్ద గరిష్టానికి చేరుతుందని అంచనా వేసిన ఐక్యరాజ్యసమితి.. అక్కడ నుంచి దిగొస్తూ ఈ శతాబ్దం చివరకు 1,020 కోట్లకు తగ్గుతుందని తెలిపింది. ఈ క్రమంలోనే... అత్యధిక జనాభా కలిగిన దేశంగా గత ఏడాది చైనాను దాడేసిన భారత్... 2100 సంవత్సరం వరకూ అదే స్థానంలో ఉంటుందని పేర్కొంది. అయితే ఈ ఏడాదిలో భారతదేశ జనాభా 145 కోట్లని అంచనా వేసిన ఐక్యరాజ్యసమితి.. మరో ముప్పై ఏళ్ళు అంటే 2054 నాటికి 169 కోట్లకు చేరుతుందని తెలిపింది. అనంతరం క్రమక్రమంగా తగ్గుతూ 150 కోట్లకు చేరుతుందని తెలిపింది. ఇక చైనా విషయానికొస్తే జనాభా తగ్గుదల విషయంలో షాకింగ్ విషయాలు వెల్లడించింది ఐరాస. ఇందులో భాగంగా... ప్రస్తుతం చైనా జనాభా 141 కోట్లు ఉండగా.. 2054 నాటికి అది 121 కోట్లకు చేరుతుందని.. 2100 నాటికి సుమారు 50% తగ్గిపోయి 63.3 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. రాబోయే ముప్పై ఏళ్లలోనే ఆ దేశ జనాభాలో భారీ తగ్గుల నమోదవుతుందని తెలిపింది. సంతాన సాఫల్యతా రేటు పడిపోతుండటమే దీనికి కారణమని వివరించింది.

# పేదవాళ్లు సైతం ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫీజు రియంబర్స్మెంట్ ఎంతగానో తోడ్పడుతుంది

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : విద్యపై ఆసక్తి ఉన్న ప్రతి పేదవారు సైతం ఉన్నత విద్యను అభ్యసించేందుకు గాను ఫీజు రియంబర్స్మెంట్ తోడ్పాటున అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. జేఎన్టీయూలో క్వాలిటీ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ పై ఇంటరాక్షన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ విధానాలను వివరించాలనే ఈ కార్యక్రమం చేపట్టాం...ప్రతీ పేదవాడి బిడ్డ గొప్పగా చదవాలని ఆనాడు వైఎస్ఆర్ ఫీజు రీయింబర్స్ మెంట్ నిర్ణయం తీసుకున్నారు.రకరకాల పరిస్థితులలో ప్రాధాన్యతలు మారి.. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పేరుకుపోయాయి.పాత బకాయిలపై ఎలా ముందుకెళ్లాలనే అంశాన్ని పరిష్కరించే బాధ్యత మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తున్నాం..ఈ అకాడామిక్ ఇయర్ నుంచి ఆన్ టైమ్ లో ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించేందుకు ప్రయత్నిస్తాం..ఫీజు రీయింబర్స్ మెంట్ పై మీకు ఎలాంటి అనుమానం అక్కర్లేదు..ఫీజు రీయింబర్స్ మెంట్ పై త్రిముఖ వ్యూహంతో మా ప్రభుత్వం ముందుకు వెళుతుంది.దేశంలో, ప్రపంచంలో గొప్ప నిర్మాణాలన్నీ ఇంజనీర్లు సృషించినవే..మానవనిర్మిత అద్భుతాలన్నీ ఇంజనీర్లు ఆవిష్కరించినవే...ఇంజనీరింగ్ కాలేజీలు నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారంగా మారకూడదు...ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి దేశ భవిష్యత్తును నిర్మించేలా ఉండాలి..అందుకు కావాల్సిన సాయాన్ని అందించేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది..కేవలం ఉద్యోగాలను సృష్టించే సంస్థలుగా కాదు.. దేశానికి మేధావులను అందించే సంస్థలుగా ఇంజనీరింగ్ సంస్థలు ఉండాలి.ఇంజనీరింగ్ లో కేవలం కంప్యూటర్ సైన్స్ పైనే కాదు... సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ లాంటి అన్ని రకాల కోర్సులనూ ప్రోత్సహించాలి..స్కిల్ డెవలప్మెంట్ లో భాగంగా టాటా భాగస్వామ్యంతో రూ.2400 కోట్లతో ప్రభుత్వం ఐటీఐల రూపురేఖలు మారుస్తోంది..ఫార్మా, ఐటీ తరువాత ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ ప్రపంచాన్ని నడిపించబోతోంది.యువత కోసం త్వరలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నాం.. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం..మా ప్రభుత్వానికి భేషజాలు లేవు... నిరుద్యోగులకు మేలు జరిగేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయి.నోటిఫికేషన్ల ప్రకారమే ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో ముందుకెళుతోంది.పదేళ్లు ఉద్యోగాల భర్తీ చేయాలని నిరుద్యోగ యువత కొట్లాడింది...కానీ.. ఇప్పుడు పరీక్షల వాయిదా కోసం కొన్ని రాజకీయ శక్తులు, కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆమరణ దీక్షలు చేస్తున్నారు...త్వరలోనే జాబ్ క్యాలెండర్ ను తీసుకురాబోతున్నాం..యూపీఎస్సీ తరహాలో ప్రతీ ఏటా క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తాం...విద్యాసంస్థలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారకూడదు అనేదే మా ప్రభుత్వ విధానం...మేం అధికారంలోకి వచ్చిన మొదటి 30రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు భర్తీ చేసాం..ఆర్థిక భారం, ఇతర సమస్యలు ఉన్నా... ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ మా ప్రభుత్వం ముందుకు వెళుతోంది..

జేఎన్టీయూలో స్టూడెంట్ వాలంటరీ పోలీసింగ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు..సమాజంలో ఉండే సమస్యలను మనమే గుర్తించి పరిష్కరించుకుంటే దుష్ఫలితాలను నివారించుకోవచ్చు.సమాజంలో పెడధోరణులకు టెక్నాలజీ కూడా ఓ కారణంగా మారింది...పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచితే చాలా సమస్యలను నివారించవచ్చు.కుటుంబ వ్యవస్థ విచిన్నం కావడమే చిన్నారుల మానసిక బలహీనతలను కారణం.చిన్నారుల మానసిక దృఢత్వానికి ఉమ్మడి కుటుంబం తోడ్పడుతుంది..పిల్లలను మానసికంగా సంసిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.ఇందుకోసం పిల్లలకు సోషల్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ నేర్పించాల్సిన అవసరం ఉంది.డ్రగ్స్ నిర్మూలనపై సీరియస్ గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది... స్కూల్స్,కాలేజెస్ లో సబ్జెక్ట్ నేర్పించడమే కాదు... మోరల్ పోలీసింగ్ కూడా నేర్పించాలి.పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించే వ్యవస్థ ఉండాలని నిర్వాహకులకు సూచించాం..స్కూళ్లు, కాలేజీల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ అవసరం ఎంతో ఉంది..పోలీసులకు సమాచారం చేరవేసేలా వ్యవస్థను తయారు చేసుకుంటే.. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చవచ్చు.డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరోను ఏర్పాటు చేసింది.డగ్స్ పై ప్రభుత్వం యుద్ధమే ప్రకటించింది.మీ అన్నగా పిలుపునిస్తున్నా... డ్రగ్స్ నిర్మూలనకు సహకరించండి...ఉద్యమాల గడ్డ తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి. అన్ని ఇంటర్ , డిగ్రీ కళాశాలల్లో కేరళ మాదిరిగా మోరల్ పోలీసింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నా... మోరల్ పోలీసింగ్ తో అన్ని రకాల సమస్యలను పరిష్కరించొచ్చు..రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలని నిర్ణయించింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్టేడియం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.భవిష్యత్ లో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది.ప్రజాప్రతినిధి అనేది అత్యంత పవిత్రమైన బాధ్యత...ప్రజా సమస్యలపై ఫోకస్ గా పనిచేయడం వల్లే నేను ఈ స్థాయికి చేరా..సమస్యలకు భయపడి పారిపోవద్దు... నిలబడి సమస్యలపై పోరాడాలి.జీవితంలో ఫోకస్ గా పనిచేయండి.. లక్ష్యాలను సాధిస్తారు. నరేంద్రమోదీకైనా, బిల్ గేట్స్ కైనా, రేవంత్ రెడ్డికైనా రోజుకు 24 గంటలే..రోజుకు 16గంటలు మీరు ఎంత ఫోకస్ గా పని చేస్తారో... అది మీ లక్ష్యాన్ని అంత చేరువ చేస్తుంది..మన జీవితం మన చేతుల్లోనే ఉంది... మన జీవితాన్ని ఎలా డిజైన్ చేసుకోవాలో మన చేతుల్లోనే ఉంటుంది..గొప్ప వ్యక్తులు ఎవరూ గొప్ప కుటుంబాల నుంచి రాలేదు...ఎవరూ ఎవరికంటే తక్కువ కాదు.ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ మంత్రివర్యులు మంత్రివర్యులు దుద్దిల శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ కమిషనర్ జయేశ్ రంజన్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, దేవసేన, డిజిపి జితేందర్, సిపి శ్రీనివాస్ రెడ్డి, సుధీర్ బాబు, అవినాష్ మహంతి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.జేఎన్టీయూలో క్వాలిటీ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ పై ఇంటరాక్షన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.ప్రభుత్వ విధానాలను వివరించాలనే ఈ కార్యక్రమం చేపట్టాం...ప్రతీ పేదవాడి బిడ్డ గొప్పగా చదవాలని వైఎస్ఆర్ ఫీజు రీయింబర్స్ మెంట్ నిర్ణయం తీసుకున్నారు.రకరకాల పరిస్థితులలో ప్రాధాన్యతలు మారి.. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పేరుకుపోయాయి.పాత బకాయిలపై ఎలా ముందుకెళ్లాలనే అంశాన్ని పరిష్కరించే బాధ్యత మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తున్నాం..ఈ అకాడామిక్ ఇయర్ నుంచి ఆన్ టైమ్ లో ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించేందుకు ప్రయత్నిస్తాం..ఫీజు రీయింబర్స్ మెంట్ పై మీకు ఎలాంటి అనుమానం అక్కర్లేదు..ఫీజు రీయింబర్స్ మెంట్ పై త్రిముఖ వ్యూహంతో మా ప్రభుత్వం ముందుకు వెళుతుంది.దేశంలో, ప్రపంచంలో గొప్ప నిర్మాణాలన్నీ ఇంజనీర్లు సృషించినవే..మానవనిర్మిత అద్భుతాలన్నీ ఇంజనీర్లు ఆవిష్కరించినవే...ఇంజనీరింగ్ కాలేజీలు నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారంగా మారకూదు...ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి దేశ భవిష్యత్తును నిర్మించేలా ఉండాలి..అందుకు కావాల్సిన సాయాన్ని అందించేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది...కేవలం ఉద్యోగాలను సృష్టించే సంస్థలుగా కాదు.. దేశానికి మేధావులను అందించే సంస్థలుగా ఇంజనీరింగ్ సంస్థలు ఉండాలి.ఇంజనీరింగ్ లో కేవలం కంప్యూటర్ సైన్స్ పైనే కాదు... సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ లాంటి అన్ని రకాల కోర్సులనూ ప్రోత్సహించాలి..స్కిల్ డెవలప్మెంట్ లో భాగంగా టాటా భాగస్వామ్యంతో రూ.2400 కోట్లతో ప్రభుత్వం ఐటీఐల రూపురేఖలు మారుస్తోంది..ఫార్మా, ఐటీ తరువాత ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ ప్రపంచాన్ని నడిపించబోతోంది.యువత కోసం త్వరలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నాం..ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం.. మా ప్రభుత్వానికి భేషజాలు లేవు... నిరుద్యోగులకు మేలు జరిగేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయి.నోటిఫికేషన్ల ప్రకారమే ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో ముందుకెళుతోంది.పదేళ్లు ఉద్యోగాల భర్తీ చేయాలని నిరుద్యోగ యువత కొట్లాడింది..కానీ.. ఇప్పుడు పరీక్షల వాయిదా కోసం కొన్ని రాజకీయ శక్తులు, కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆమరణ దీక్షలు చేస్తున్నారు...త్వరలోనే జాబ్ క్యాలెండర్ ను తీసుకురాబోతున్నాం..యూపీఎస్సీ తరహాలో ప్రతీ ఏటా క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తాం...విద్యాసంస్థలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారకూడదు అనేదే మా ప్రభుత్వ విధానం...మేం అధికారంలోకి వచ్చిన మొదటి 30రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు భర్తీ చేసాం..ఆర్థిక భారం, ఇతర సమస్యలు ఉన్నా... ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ మా ప్రభుత్వం ముందుకు వెళుతోంది..జేఎన్టీయూలో స్టూడెంట్ వాలంటరీ పోలీసింగ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు..సమాజంలో ఉండే సమస్యలను మనమే గుర్తించి పరిష్కరించుకుంటే దుష్ఫలితాలను నివారించుకోవచ్చు.సమాజంలో పెడధోరణులకు టెక్నాలజీ కూడా ఓ కారణంగా మారింది...పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచితే చాలా సమస్యలను నివారించవచ్చు. కుటుంబ వ్యవస్థ విచిన్నం కావడమే చిన్నారుల మానసిక బలహీనతలను కారణం.చిన్నారుల మానసిక దృఢత్వానికి ఉమ్మడి కుటుంబం తోడ్పడుతుంది..పిల్లలను మానసికంగా సంసిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.ఇందుకోసం పిల్లలకు సోషల్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ నేర్పించాల్సిన అవసరం ఉంది.డ్రగ్స్ నిర్మూలనపై సీరియస్ గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది...స్కూల్స్,కాలేజెస్ లో సబ్జెక్ట్ నేర్పించడమే కాదు... మోరల్ పోలీసింగ్ కూడా నేర్పించాలి.పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించే వ్యవస్థ ఉండాలని నిర్వాహకులకు సూచించాం..స్కూళ్లు, కాలేజీల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ అవసరం ఎంతో ఉంది..పోలీసులకు సమాచారం చేరవేసేలా వ్యవస్థను తయారు చేసుకుంటే.. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చవచ్చు.డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరోను ఏర్పాటు చేసింది.డ్రగ్స్ పై ప్రభుత్వం యుద్ధమే ప్రకటించింది.మీ అన్నగా పిలుపునిస్తున్నా... డ్రగ్స్ నిర్మూలనకు సహకరించండి...ఉద్యమాల గడ్డ తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి.అన్ని ఇంటర్ , డిగ్రీ కళాశాలల్లో కేరళ మాదిరిగా మోరల్ పోలీసింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నా... మోరల్ పోలీసింగ్ తో అన్ని రకాల సమస్యలను పరిష్కరించొచ్చు..రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలని నిర్ణయించింది.పతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్టేడియం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.భవిష్యత్ లో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది.ప్రజాప్రతినిధి అనేది అత్యంత పవిత్రమైన బాధ్యత...పజా సమస్యలపై ఫోకస్ గా పనిచేయడం వల్లే నేను ఈ స్థాయికి చేరా..సమస్యలకు భయపడి పారిపోవద్దు... నిలబడి సమస్యలపై పోరాడాలి.జీవితంలో ఫోకస్ గా పనిచేయండి.. లక్ష్యాలను సాధిస్తారు. నరేంద్రమోదీకైనా, బిల్ గేట్స్ కైనా, రేవంత్ రెడ్డికైనా రోజుకు 24 గంటలే..రోజుకు 16గంటలు మీరు ఎంత ఫోకస్ గా పని చేస్తారో... అది మీ లక్ష్యాన్ని అంత చేరువ చేస్తుంది..మన జీవితం మన చేతుల్లోనే ఉంది... మన జీవితాన్ని ఎలా డిజైన్ చేసుకోవాలో మన చేతుల్లోనే ఉంటుంది..గొప్ప వ్యక్తులు ఎవరూ గొప్ప కుటుంబాల నుంచి రాలేదు...

ఎవరూ ఎవరికంటే తక్కువ కాదు.ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ మంత్రివర్యులు మంత్రివర్యులు దుద్దిల శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ కమిషనర్ జయేశ్ రంజన్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, దేవసేన, డిజిపి జితేందర్, సిపి శ్రీనివాస్ రెడ్డి, సుధీర్ బాబు, అవినాష్ మహంతి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్లో వనమహోత్సవ కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు



శామీర్ పేట, (గరుడ వార్త) :పర్యావరణ పరిరక్షణను కాపాడేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కరస్పాండెంట్ వరప్రసాద్ రెడ్డిలు ఆకాంక్షించారు. శనివారం శామీర్ పేట మండలం తుర్కపల్లి పరిధిలోని సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్ లో వనమహోత్సవం లో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం మొక్కలు నాటడంతో కలిగే ప్రయోజనం గురించి విద్యార్థులతో ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. నేడు నాటిన మొక్కలే భవిష్యత్తులో వృక్షాలుగా ఎదిగి భావితరాలకు మనుగడగా నిలుస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్చార్జీలు గ్రేస్, గౌసియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# వ్యాధుల కాలం.. అప్రమత్తతే ప్రధానం

గోదావరిఖని :జిల్లాలో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో 1, ఏప్రిల్‌లో 3 కేసులు నమోదు కాగా, ఈ నెలలో మల్యాల, రాయికల్, కోరుట్ల, కథలాపూర్ మండలాల్లో ఒక్కో కేసు చొప్పున వెలుగు చూసింది. నాలుగు రోజుల్లోనే నాలుగు కేసులు వెలుగు చూడడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే వర్షాలు కురిసి పలు చోట్ల నీరు నిల్వ ఉండడంతో డెంగీ మరింత విజృంభించే అవకాశమున్నట్లు భావిస్తున్నారు.
జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో నీరు నిల్వ చేరడంతోపాటు మురుగు, చెత్త పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఖాళీ స్థలాలు మురుగు కుంటలుగా మారి దోమలు పెరిగి జ్వరాలు ప్రబలుతున్నాయి. పట్టణాల్లో, గ్రామాల్లో పారిశుధ్య చర్యలు కానరావడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణ మార్పులతో కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటుండగా, జ్వరాలు, వాంతులు, విరేచనాలతో పాటు డెంగీ, మలేరియా వ్యాపించే



ప్రమాదముంది. ఈ కాలంలో రోగాలు దరి చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు నివారించవచ్చు. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా చూడాల్సి ఉంటుంది.

జ్వర సర్వే పూర్తి..

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గత నెలలో ఇంటింటికీ జ్వర సర్వే నిర్వహించారు. జిల్లాలోని 22 పీహెచ్‌సీల పరిధిలో 2,61,955 గృహాలను సందర్శించి 10,99,352 మందిని సర్వే చేశారు. ఇందులో 774 మంది జ్వరం, జలుబు, దగ్గు తదితర లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న పాత్రలు, కుండీలు, ప్రదేశాలు గుర్తించి అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని వివరించారు. కాగా వాతావరణ మార్పులతో ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరిగింది. పీహెచ్‌సీలలో వంద వరకు, సామాజిక ఆసుపత్రుల్లో సుమారు 300 వరకు ఓపీ వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

ముందస్తు చర్యలతోనే..

వర్షాకాలంలో వ్యాధుల కట్టడికి ముందస్తు చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో మురుగు కాల్వలను ఎప్పటికపుడు శుభ్రం చేయకపోవడం, బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడంతో దోమల బెడద పెరుగుతోందని ప్రజలు పేర్కొంటున్నారు. ఆయా చోట్ల ఖాళీ స్థలాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల నివారణకు ఫాగింగ్ చేయకపోవడంతో యంత్రాలు మూలనపడ్డాయి. పంచాయతీరాజ్, మునిసిపాలిటీ, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారుల సమన్వయంతో ముందుస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే వ్యాధులను కట్టడి చేయవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్షేత్రస్థాయిలో అవగాహన

వ్యాధుల నియంత్రణకు అప్రమత్తతతో వ్యవహరిస్తున్నాము. మొదటి విడత జ్వర సర్వే పూర్తికాగా రెండో విడత ప్రారంభించాము. శుక్రవారం డ్రై డే పాటించేలా అవగాహన కల్పిస్తున్నాము. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటిస్తూ జాగ్రత్తలు చెబుతున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ముఖ్యం. జ్వరం వస్తే ప్రభుత్వాసుపత్రిలో వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలి.
ఎన్.శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి

# ఉపాధ్యాయుల బదిలీలలు

కరీంనగర్ : ఇటీవల జిల్లాలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో పలువురు నిబంధనలను కాలరాశారు. ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్న విద్యాశాఖ హడావుడి పలువురు ఉపాధ్యాయులకు కలిసి వచ్చింది. ఎట్టకేలకు పదోన్నతులు, బదిలీలను పారదర్శకంగా పూర్తిచేశామని జిల్లా విద్యాశాఖ అధికారులు ఊపిరిపీల్చుకున్న తరుణంలో బదిలీల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. ఎస్జీటీలు, తత్సమాన క్యాడర్ ఉపాధ్యాయుల బదిలీల్లో స్పౌజ్ పాయింట్లను వాడుకోవడంలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఆన్‌లైన్ ద్వారా బదిలీ ఉత్తర్వులను పరిశీలించడంలో చోటు చేసుకున్న జాప్యం స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగానికి దోహదమైంది. ఈ పరిణామాలతో అర్హులైన ఉపాధ్యాయులు నష్టపోతున్నారు. స్పౌజ్ పాయింట్లను ఉపయోగించుకుని నచ్చిన బడికి బదిలీ అయిన ఉపాధ్యాయుల తీరు విమర్శలకు తావిస్తోంది. ఓవైపు బదిలీ అయిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధుల్లో చేరాక ఇప్పుడు ఆ అక్రమాలను చక్కదిద్దే కార్యక్రమానికి విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టడం గమనార్హం. వారి పరిశీలనలో ఒక్కొక్కటిగా ఇలాంటి అక్రమాలు బయటపడుతున్నాయి.
నిబంధనలు బేఖాతరు భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే స్పౌజ్ కేటగిరిలో బదిలీ కావాల్సిన వారు స్పౌజ్ పాయింట్లు 10 వాడుకుంటూ నిబంధనల ప్రకారం బదిలీల స్థానాలను ఎంపిక చేసుకోవాలి. భార్యాభర్తల్లో భర్త ఈ పాయింట్లను ఉపయోగిస్తే భార్య పనిచేసే మండలంలోని సమీపానికి.. భార్య ఉపయోగిస్తే భర్త పనిచేసే మండలంలోని సమీపానికి బదిలీ అవ్వాలనే నిబంధన ఉంది. ఆ మండలంలో ఖాళీలు లేకపోతే పక్క మండలానికి, తరువాత ఇతర మండలాలకు బదిలీ కోరుకోవాలి. గత నెల చివరి వారంలో ఎస్జీటీలు, పీఈటీలు, పండితుల బదిలీలను విద్యాశాఖ చేపట్టింది. ఆన్‌లైన్ ద్వారా ప్రక్రియను చేపట్టడంతో ఈ నిబంధనలను అధికారులు పట్టించుకోరనే భావనతో ప్రస్తుతం పనిచేస్తున్న మండలాలతో పాటు వారికి ఇష్టమున్న మండలాల బదులకు వెళ్లేందుకు ఆప్షన్లు పెట్టుకున్నారు. ఈ విషయాలను పరిశీలించి బదిలీ ఉత్తర్వులిచ్చే సమయం లేకపోవడంతో అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో ఎంఈవోలు కూడా వారిని రిలీవ్ చేయడం, చేర్చుకోవడం వంటివి చేశారు. దీంతో పలువురు ఉపాధ్యాయులు అదనపు పాయింట్లను దుర్వినియోగం చేస్తూ ఇష్టానుసారంగా బదిలీలను కోరుకుని, అనుకున్న చోట పోస్టింగ్‌లు పొందారు. చాలామంది ఇలా కరీంనగర్‌కు సమీప మండలాల్లోని పాఠశాలలకు బదిలీ అయ్యారనే చర్చ ఉపాధ్యాయ వర్గాల్లో కొనసాగుతోంది. దీంతో అర్హులైన ఉపాధ్యాయులు నష్టపోయారు.
రంగంలోకి జిల్లా విద్యాశాఖ : స్పౌజ్ కేటగిరిల్లో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన బదిలీల దిద్దుబాటుకు జిల్లా విద్యాశాఖ రంగంలోకి దిగింది. ఈ కేటగిరి కింద జిల్లాలో 48 మంది బదిలీ అయినట్లు గుర్తించారు. బదిలీల కోసం వారు పెట్టుకున్న స్థానాల ఆప్షన్ల ఫారాలతో వారిని అధికారులు మంగళవారం పిలిపించి వివరాలను తీసుకున్నారు. వాటిని మండలాల వారీగా ఎంఈవోలు పరిశీలించి స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసిన వారిని గుర్తించే పనిలో ఉన్నారు. బదిలీ అక్రమమని తేలితే వారిని మిగిలిన ఖాళీలు గల పాఠశాలలకు బదిలీ చేసే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం.
ఇదీ సంగతి..! మానకొండూర్ మండలంలో భార్యాభర్తలిద్దరు పనిచేస్తున్నారు. వారిలో ఒకరు బదిలీ కోసం అదే మండలంలోని పాఠశాలలను కోరుకోవాల్సి ఉండగా, రామడుగు మండలంలోని హెచ్‌ఆర్ఏ పొందే పాఠశాలను కోరుకుని బదిలీ అయ్యారు.మానకొండూర్ మండలంలో పనిచేస్తున్న భార్యాభర్తల్లో ఒకరు బదిలీకి స్పౌజ్‌కు సమీపంలోని పాఠశాలల ఖాళీలను కోరుకోవాల్సి ఉండగా, ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలకు సమీపంలోని బడిని కోరుకుని బదిలీ అయ్యారు.

# సన్నాలపై రైతుల ఆసక్తి




జగిత్యాల : రాష్ట్రప్రభుత్వం సన్నగింజ వరిరకాలకు బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తామని ప్రకటించటంతో ఈ వానాకాలంలో ఉమ్మడి జిల్లాలో సన్నవరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. కేంద్రం పెంచిన మద్దతుధర క్వింటాలు ఫైన్‌రకాలకు రూ.2,320, కామన్ రకాలకు రూ.2,303 ఉండగా సన్నగింజ రకాలకు అదనంగా రూ.500 వర్తింపచేస్తారు.

సాగుచేస్తున్న రకాలు

జగిత్యాల పరిశోధనస్థానం రకాలు: జేజీఎల్1798, జేజీఎల్3844, జేజీఎల్11118, జేజీఎల్17004, జేజీఎల్11470, జేజీఎల్28545, జేజీఎల్27356, జేజీఎల్384, జేజీఎల్3828, జేజీఎల్3855, జేజీఎల్11727
కూనారం పరిశోధనస్థానం రకాలు: కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733
వరంగల్ పరిశోధనస్థానం రకాలు: వరంగల్962, వరంగల్1119, వరంగల్44, వరంగల్347, వరంగల్14, వరంగల్32100, వరంగల్697రాజేంద్రనగర్ రకాలు: ఆర్ఎన్ఆర్15048 (తెలంగాణసోన), ఆర్ఎన్ఆర్21278, ఆర్ఎన్2458, ఆర్ఎన్ఆర్2354, ఆర్ఎన్ఆర్2465 బాపట్ల రకాలు: బీపీటీ5204, బీపీటీ2595మారుటేరు, నెల్లూరు, రుద్రూరు తదితర పరిశోధనస్థానాల నుంచి రూపొందించిన రకాలతో పాటు హెచ్ఎంటీసోనా, మరికొన్ని ప్రైవేటు సన్నగింజ రకాలు కూడా సాగులో ఉన్నాయి.చీడపీడల తీవ్రత ఎక్కువేఉమ్మడి జిల్లాలో వానాకాలంలో 9.65 లక్షల ఎకరాల్లో వరిసాగు అంచనా కాగా నిరుడు సన్నరకాలను 87 వేల ఎకరాల విస్తీర్ణంలో పండించగా ఈ సారి 3.05 లక్షల ఎకరాల్లో పండిస్తారని అంచనా. సన్నగింజ రకాల్లో సుడిదోమల వంటి చీడపీడల తీవ్రత చాలాఎక్కువగా ఉంటుండటం, సస్యరక్షణ ఖర్చు, మందుల పిచికారీశ్రమ, లోతట్టు వందూరు భూములు అధికంగా ఉండటంతో దొడ్డుగింజ రకాలవి కూడా అధికంగానే నార్లు పోస్తున్నారు. సన్నవరి సాగుచేసే వీలుగాని నేలల్లో రైతులు దొడ్డువడ్లను పండించినా ప్రభుత్వం ఇప్పటి మాదిరిగానే కనీస మద్దతుధరకు కొనుగోలు చేయాలని కర్షకులు కోరుతున్నారు.
మేలైన విత్తనాలను సేకరించుకోవాలి130 రోజుల కాలపరిమితిగల మధ్యకాలిక రకాలకు జులై 10 వరకు, 120 రోజుల పంటకాలంగల స్వల్పకాలిక రకాలతో జులై నెలాఖరువరకు నార్లు పోసుకోవచ్చు. ఏ రకమైనా ఆగస్టు నెలాఖరు లోపు నాట్లు పూర్తిచేయాలి. సాగు అనుభవాలను బట్టి సన్నరకాలను ఎన్నుకోవాలి. రైతులు తోటిరైతుల వద్ద రైతువిత్తనాన్ని లేదా గతంలో మినీకిట్సగా తీసుకున్న సన్నవిత్తనాలను కూడా సాగుచేయవచ్చు. సన్నాల్లోనూ సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడిని పొందవచ్చు.డాక్టర్ బి.శ్రీనివాస్, వరి శాస్త్రవేత్త, జగిత్యాల ఆర్ఏఆర్ఎస్

# ఎప్పటికో శుద్ధీకరణ



సిరిసిల్ల : కోరుట్ల మున్సిపాలిటీ పరిధిలో మల వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం నాలుగేళ్ల క్రితం, రామగుండం నగరపాలికలో ఏడాది క్రితం నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సెప్టిక్ ట్యాంకుల ద్వారా వచ్చే మానవ వ్యర్థాలను మాత్రమే శుద్ధి చేస్తున్నారు. దీని ద్వారా వచ్చే ఎరువును మొక్కలకు, పంట పొలాలకు వినియోగించుకుంటున్నారు. ఈ ఎరువు విక్రయించడం ద్వారా ఆదాయం కూడా రానుంది.చెత్త మొదలుకొని.. మానవ వ్యర్థాల వరకు ఎరువుల తయారీ చేయడంతో పాటు ఎప్పటికప్పుడూ శుద్ధీకరణ చేస్తే పట్టణాలు, నగరాలు ఆరోగ్యకరంగా ఉంటాయి. వీటిని నిర్మించేందుకు మూడేళ్ల కిందట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చినప్పటికి.. కొన్ని పురపాలికల్లో పూర్తి కాగా, మిగతా ప్రాంతాల్లో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.
న్యూస్‌టుడే, కరీంనగర్ కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరపాలికలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణాలుగా (ఓడీఎఫ్, ఓడీఎఫ్ం) దూసుకెళ్తున్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ ఒక అడుగు ముందుకేసి వాటర్ం సాధించింది. ఇంకేముంది ఎంపిక చేసిన మున్సిపాలిటీల్లో మానవ వ్యర్థాల శుద్ధీకరణ కోసం ఎఫ్ఎస్‌టీపీలు (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా 16 మున్సిపాలిటీల పరిధిలో పది చోట్ల ఎఫ్ఎస్‌టీపీలు నిర్మించేందుకు మూడేళ్ల కిందట ప్రతిపాదనలు చేశారు. మూడు ప్రాంతాల్లో నిర్మించగా, అవి వినియోగంలోకి వచ్చాయి. మిగతా వాటి కోసం గతేడాది స్థలాలు అప్పగించినా ఇప్పటికి పనులు ప్రారంభించలేదు. ఒక్కో ప్లాంటుకు రూ.60 లక్షల మేర ఖర్చు అవుతుంది.

మానవ వ్యర్థాలతో ఎరువు తయారీ

ఇళ్లలోని సెప్టిక్ ట్యాంకుల నుంచి మానవ వ్యర్థాలను సెప్టిక్ క్లీనింగ్ వాహనాల ద్వారా వీటిని శుద్ధీ కేంద్రానికి తరలిస్తారు. యంత్రాల ద్వారా, గ్రావిటి ద్వారా వ్యర్థాలను వివిధ దశల్లో వేరు చేసి శుద్ధి చేస్తారు. ఘన, ద్రవ వ్యర్థాలు శుద్ధి చేసి నీటిని మొక్కలకు పంపిస్తారు. ఘన వ్యర్థాలతో ఎరువు తయారు చేస్తారు. ఇలా రామగుండం నగరపాలిక, సిరిసిల్ల, కోరుట్ల మున్సిపాలిటీల్లో శుద్ధి చేసే ప్రక్రియ కొనసాగుతోంది. దీని నిర్వహణను ఆస్కి సంస్థ నిర్వహణను చూసుకుంటుంది.

భూగర్భ మురుగునీటి శుద్ధితోనే..


కరీంనగర్ నగరపాలిక పరిధిలో భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రం కొంతమేర ఊరటనిస్తోంది. నగరవ్యాప్తంగా ఉన్న సెప్టిక్ క్లీనింగ్ వాహనాలు సేకరిస్తున్న మల వ్యర్థాలను యూజీడీలోనే వేసి శుద్ధి చేస్తున్నారు.
మొత్తం వ్యర్థాలను నీరుగా చేసి శుద్ధి చేసిన నీటిని చెరువుల్లోకి వదులుతున్నారు. ఎస్టీపీలోనే సాంకేతికను జోడించగా భవిష్యత్తు అవసరాలకు కొత్తగా ఎఫ్ఎస్‌టీపీ అవసరమని అధికారులు ప్రతిపాదనలు చేశారు.

మూడేళ్లుగా పట్టింపేదీ?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని నిర్మించాలని మూడేళ్ల క్రితమే టెండర్లు పిలిచారు. రాష్ట్రస్థాయిలోనే ప్యాకేజీల వారీగా ఖరారు చేయగా ఇప్పటికీ వీటిని నిర్మించేందుకు ముందుకు రావడం లేదు. వీరికి ఇచ్చిన ఒప్పంద గడువు ముగిసింది. మున్సిపాలిటీల్లో స్థలాలు సేకరించి అప్పగించడంలో కమిషనర్లు ఆసక్తి చూపించలేదు. ప్రస్తుతం ఆ పనులు చేసేందుకు ఏజెన్సీ సిద్ధంగా ఉండటంతో కరీంనగర్‌లో యూజీడీ ఎస్టీపీ పక్కనే ఎకరం స్థలం అప్పగించారు. ఆరు నెలలుగా పనులు మాత్రం ప్రారంభించలేదు. పరిశీలిస్తాంమున్సిపాలిటీల్లో మానవ వ్యర్థాల శుద్ధీ కేంద్రాలను నిర్మించడంలో ఎందుకు ఆలస్యం అవుతుందో పరిశీలిస్తాం. దీనికి సంబంధించిన వివరాలను తీసుకొని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.ప్రఫుల్ దేశాయ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కరీంనగర్

# అయ్యో పాపం.. అందరిదీ నిర్లక్ష్యం!

పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో సెప్టిక్‌ట్యాంకులో పడి బాలుడు జాన్‌వెస్లీ మృతి చెందిన ఘటన నిర్వాహకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. ఈ ప్రమాదానికి ఆసుపత్రి శానిటరీ సూపర్‌వైజర్ అలకపల్లి సంపత్ కారణమని మృతుడి తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఆస్పత్రిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ ప్రక్రియ పరిశీలన వరకే తన బాధ్యత అని, సెప్టిక్‌ట్యాంక్ మ్యాన్‌హోల్‌కు మూత లేదని, గతంలోనూ ఇదే పరిస్థితి ఉందని సంపత్ పేర్కొన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కావాలనే తనను ఈ కేసులో ఇరికించారంటూ బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సెప్టిక్‌ట్యాంక్‌కు మూత పెట్టడం సివిల్ వర్క్ కిందకు వస్తుందని, దానికి తమ విధులకు సంబంధం లేదని, ఆస్పత్రిలోని ఆధిపత్య రాజకీయాలతోనే తనపై పోలీసులకు ఫిర్యాదు చేశారని అందులో శానిటరీ సూపర్‌వైజర్ సంపత్ పేర్కొన్నారు.ఎన్నెన్నో సందేహాలుతప్పు ఎవరిదైనా ఆస్పత్రి వర్గాల నిర్లక్ష్యమే బాలుడి ప్రాణం తీసింది. కొన్నేళ్లుగా సెప్టిక్‌ట్యాంక్ మ్యాన్‌హోల్‌కు మూత లేదని చెబుతున్న సూపర్‌వైజర్ ఈ విషయాన్ని అధికారులు దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదన్న దానికి జవాబు లేదు.బాలుడిని సెప్టిక్‌ట్యాంక్ నుంచి తీసేంత వరకు కనిపించని మూత ఆ తర్వాత ఎక్కడి నుంచి వచ్చిందో విచారణ జరపాల్సి ఉంది.ఘటన సమయంలో సెప్టిక్ ట్యాంకుకు చెందిన మూడు మ్యాన్‌హోళ్లలో రెండింటికి మూత ఉండగా,



ఒకటి లేకుండా ఉంది. ప్రమాదం జరిగిన తరువాత మాత్రం అప్పటికప్పుడు వచ్చి పడింది.కొన ఊపిరితో ఉన్న బాలుడు జాన్‌వెస్లీని కరీంనగర్‌కు ఆస్పత్రి అంబులెన్స్ అందుబాటులో ఉన్నప్పటికీ ప్రైవేటు అంబులెన్స్‌లో ఇద్దరు డాక్టర్ల పర్యవేక్షణలో తీసుకెళ్లారు.అంబులెన్స్‌లో రోగి వెంట వైద్యులు వెళ్లడం మంచిదే అయినా ప్రభుత్వ ఆస్పత్రి అంబులెన్స్‌లో, అది లేకుంటే 108 వాహనంలో తీసుకెళ్లాల్సి ఉండగా ప్రైవేటు వాహనంలో తరలించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పెద్దపల్లి ఆస్పత్రిలో బాలుడికి చికిత్స అందించే క్రమంలోనూ ఆస్పత్రి వర్గాలు లోపలికి ఎవరినీ అనుమతించలేదు. మీడియాను కూడా అనుమతించకుండా పోలీసుల పర్యవేక్షణలో వైద్య సేవలందించారు. పలు అంశాలు జవాబు లేని ప్రశ్నలుగా మిగిలాయి.

# నీరు ఎత్తిపోసేదెప్పుడు..?

ఏటా భారీ వర్షాలతో గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. అయినప్పటికీ నదీ పరీవాహక ప్రాంతాలకు పూర్తి స్థాయిలో సాగు నీరందని ద్రాక్షగానే మారింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు ఆరంభ శూరత్వంగా మారాయి. నిర్వహణపై పాలకుల్లో చిత్తశుద్ధిలోపం, రైతుల మధ్య ఐక్యత లేకపోవడంతో పథకాలు పనిచేయక భూములు బీళ్లుగా ఉంటున్నాయి. జిల్లాలో మల్లాపూర్, రాయికల్, బీర్‌పూర్, ధర్మపురి, వెల్గటూర్ మండలాల్లో గోదావరి తీరం వెంట ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన పథకాలు కొంత మేర సాగునీరందిస్తున్నప్పటికీ గతంలో ఏర్పాటు చేసిన రంగసాగర్, చిత్రవేణిగూడెం, జగన్నాథపూర్, తిమ్మాపూర్, ఒబులాపూర్ పథకాలకు నిధులు విడుదల లేక నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలు రైతులకు కాకుండా ప్రభుత్వం చేపడుతుందని ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

పథకాలు: రంగసాగర్‌లో రెండు, చిత్రవేణిగూడెం, కమ్మునూర్, మంగెళ, రేకులపల్లె, చిన్న కొల్వాయి
మండలం: బీర్‌పూర్
ఆయకట్టు: 6 వేల ఎకరాలు
ప్రారంభించింది: 1988, 2009
వ్యయం: రూ.65 కోట్లు
సమస్యలు: రంగసాగర్, చిత్రవేణిగూడెంలో 1988లో రూ.45 లక్షలతో ఏర్పాటు చేయగా ఏడాది పాటు సజావుగా పనిచేసిన తర్వాత మూలన పడ్డాయి. మూలనపడిన పథకాలకు 20 ఏళ్ల కిందట రూ.50 లక్షలు వ్యయం చేసి మరమ్మతు చేపట్టినప్పటికీ పనిచేయకుండా మూలన పడిఉన్నాయి. ప్రస్తుతం విద్యుత్తు నియంత్రికలు, పథకాలు, పంపుహౌస్‌లు వరదకు కొట్టుకు పోయాయి. 2009లో నూతనంగా ఏర్పాటు చేసిన కమ్మునూర్, మంగెళ, రేకులపల్లె, చిన్న కొల్వాయి పథకాలు రెండేళ్ల కిందట వరదకు కొట్టుకుపోగా రూ.27 కోట్లతో మరమ్మతు చేపట్టగా ఈ ఏడాది పనిచేస్తున్నాయి. అయినప్పటికీ పూర్తి స్థాయిలో నీరు అందడంలేదు.

పథకాలు: బోర్నపల్లి, కొత్తపేట, జగన్నాథపూర్
మండలం: రాయికల్
ఆయకట్టు: 900 ఎకరాలు
ప్రారంభించింది: 1995, 2013
వ్యయం: రూ.9 కోట్లు
సమస్యలు: జగన్నాథపూర్‌లోని పాత ఎత్తిపోతల పథకం 600 ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉండగా పనిచేయడం లేదు. కొత్తపేటలోని ఎత్తిపోతల పథకం పనిచేయక పోవడంతో సుమారు 500 ఎకరాలకు సాగు నీరు అందడం లేదు. ఎత్తిపోతల పథకాల మోటార్లు కాలిపోవడంతో మరమ్మతు చేపట్టకపోవడంతో నిరూపయోగంగా మారాయి. గత జనవరిలో జగన్నాథపూర్ ఎత్తిపోతల పథకాన్ని అధికారులు పరిశీలించి అంచనాలు సిద్ధం చేశారు. ఇప్పటి వరకు మరమ్మతు చేయకపోవడంతో నిరూపయోగంగా మారింది.

పథకాలు: రాయపట్నం, తిమ్మాపూర్, దమ్మన్నపేట, రాజారం, జైన దొంతాపూర్, ఆరెపల్లి, వెల్గటూర్ మండలంలో ముత్తునూర్
మండలం: ధర్మపురి
ఆయకట్టు: 10 వేల ఎకరాలు
ప్రారంభించింది: 2019–20
వ్యయం: రూ.90 కోట్లు
సమస్యలు: గతేడాది వానాకాలంలో రాయపట్నం, రాజారం, దమ్మన్నపేట సాగు నీటి పథకాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 2023లో రూ.కోటి నిధులు మంజూరు చేయించి మరమ్మతు పూర్తి చేసినా అరకొరగానే సాగు నీరు అందుతోంది. రాయపట్నంలో రూ.3 లక్షల వ్యయంతో రైతుల పైపులను ఏర్పాటు చేసుకుని ప్రయత్నాలు చేశారు. పథకాల ద్వారా పది వేల ఎకరాల ఆయకట్టు సాగునీరందించాల్సి ఉండగా మొత్తం 5 వేల ఎకరాలకు మాత్రమే సాగు నీరందుతోంది.

పథకాలు: ఒబులాపూర్
మండలం: మల్లాపూర్
ఆయకట్టు: 2 వేల ఎకరాలు
ప్రారంభించింది: 1991
వ్యయం: రూ.1.50 కోట్లు
సమస్యలు: పథకం ప్రారంభించిన తరువాత నాలుగేళ్ల పాటు సజావుగా పనిచేసినప్పటికీ విద్యుత్తు బకాయిలు పేరుకుపోవడంతో నిలిచిపోయాయి. నిధులు మంజూరు చేయడంతో మరో 3 ఏళ్లు పాటు పనిచేశాయి. అప్పటి నుంచి మరమ్మతుకు నిధులు మంజూరు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

మోటార్లు ఏర్పాటు చేసుకుంటున్నాం..

ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల మరమ్మతుకు నిధులు విడుదల చేయడం లేదు. మరమ్మతు చేపట్టిన ఏడాది కూడా పనిచేయకపోవడంతో గోదావరి నుంచి ప్రత్యేకంగా మోటార్లు ఏర్పాటు చేసుకుని సాగు చేసుకోవాల్సి వస్తోంది. ఎత్తిపోతల పథకాలు పనిచేస్తే కుంటలు, చెరువుల్లోకి నీటిని మళ్లించుకునే అవకాశముంటుంది. దీని ద్వారా భూగర్భ జలాలు పెరగనున్నాయి.
శ్రీరాముల కిష్టయ్య, రంగసాగర్

ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం

గతంలో పనిచేయని ఎత్తిపోతల పథకాలను పరిశీలించి అవసరమైన మరమ్మతుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. ఇప్పటికే గతంలో ఏర్పాటు చేసిన పలు పథకాల మరమ్మతుకు ప్రాథమిక అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతేడాది గోదావరి వరదకు కొట్టుకుపోయిన పథకాలను మరమ్మతు చేపట్టి సాగు నీరు అందిస్తున్నాం.చక్రునాయక్, డీఈఈ, ఇరిగేషన్

# మట్టికి లెక్క ఉందా?

పెద్దపల్లి: నగరంలోని కశ్మీర్‌గడ్డ రైతు బజారులో స్మార్ట్‌సిటీ నిధులతో కొత్తగా సమీకృత మార్కెట్ నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. దీనికోసం తవ్విన మట్టి కలెక్టరేట్ లోని మైదానంలో తరలిస్తున్నారు. ఈ మట్టి తవ్వేందుకు ఎర్త్‌వర్క్, కటింగ్ ఛార్జీలను బిల్లులో రికార్డు చేస్తారు. ఆ తర్వాత మళ్లీ పోసేందుకు అయ్యే ఖర్చులు కూడా చూపించుకుంటారు. ఇక్కడ తవ్వే మట్టి.. మొరం తరహాలో ఉండటంతో దీనికి డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ మట్టిని కలెక్టరేట్ ఖాళీ స్థలంలో డంపింగ్ చేసుకొని తిరిగి అక్కడే పోసుకోవడానికి నిర్ణయించినట్లు సమాచారం. అక్కడి నుంచి ఇక్కడికి తరలించే సమయంలో లెక్క ఉందా లేదా అనే ప్రశ్నలు వ్యక్తమవుతు న్నాయి. గతంలో ఇందిరాచౌక్ జంక్షన్‌లోని ఎర్రమట్టిని మాయం చేసి సొమ్ము చేసుకోవడంతో విమర్శలు వచ్చాయి. రికవరీ చేశామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నా.. ఎంతమేర రికార్డు చేశారనేదీ చెప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఇక్కడి మట్టిని ఏం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఇన్‌ఛార్జి డీఈఈ అయూబ్‌ఖాన్‌కు వివరణ కోరగా.. మట్టిని కలెక్టరేట్‌లో నిల్వ చేస్తున్నారని, తిరిగి అక్కడికి తీసుకెళ్తారని వివరించారు. దీనికి సంబంధించిన వివరాలను నమోదు చేశారని పేర్కొన్నారు.

# నియంత్రణ లేదు.. వనరులు సరిపోవు

గోదావరిఖని : మన దేశంలో ప్రతి నిమిషానికి జననాల సంఖ్య 34 ఉండగా రోజుకు ఈ సంఖ్య 49,481 ఉంది. కాగా 26,789 మంది మరణిస్తున్నారు. పుట్టుకకు, మరణాలకు చాలా వ్యత్యాసం ఉంది.

జనాభా లెక్కల సర్వే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉంది. 2001 తర్వాత 2011లో అధికారికంగా జనాభా లెక్కలను చేసిన ప్రభుత్వ యంత్రాంగం 2021లో చేయాల్సిన జనాభా లెక్కలను కొవిడ్ కారణంగా చేపట్టలేదు. 2001 జనాభాతో పోల్చితే 2011 నాటికి 14.96 శాతం జనాభా పెరిగింది. తాజా అంచనా ప్రకారం మరో 15 నుంచి 17 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2024 నాటికి 40 లక్షల వరకు జనాభా చేరుకుంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

పట్టణాలకు వలస : వివిధ కారణాల రీత్యా పట్టణ ప్రాంతాలకు వలసలు పెరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే విద్య, వైద్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, సౌకర్యాలు మెరుగ్గా ఉండటంతో చాలామంది పట్టణాల్లో ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంతాలే అధికం. 25 లక్షలకు పైగా జనాభా ఇక్కడ నివసిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో 12 లక్షల వరకు ఉంటున్నారు.

పెరుగుతున్న అవగాహన

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ నియంత్రణపై చాలామందికి అవగాహన తక్కువగా ఉంటోంది. ఒకరుముద్దు.. ఇద్దరు వద్దు... మేమిద్దరం... మాకిద్దరు వంటి నినాదాలను గతంలో ప్రజల్లోకి తీసుకువెళ్లగా చాలామందిని ఆలోచింపజేశాయి. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో అవగాహన చాలావరకు పెరిగింది. ఒకరు లేదా ఇద్దరు పిల్లలు చాలని అనుకుంటున్నారు. అధిక జనాభా వల్ల కలిగే ఇబ్బందులపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలను విరివిగా నిర్వహించాల్సిన అవసరముంది.

భవిష్యత్తులో తప్పని ఇబ్బందులు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడం, సంక్షేమ పథకాలు అమలు చేయడం ప్రభుత్వాలకు భారంగా మారుతుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు క్రమక్రమంగా నిరుద్యోగం పెరుగుతుంది.మౌలిక వసతుల కల్పన కోసం సహజ వనరులను పరిమితికి మించి వినియోగించాల్సి వస్తుంది. ఈ కారణంగా కొన్ని సంవత్సరాల్లోనే సహజ వనరులు కనుమరుగై పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది.తాగునీటి నుంచి తినే తిండి వరకు జనాభాకు సరిపడా ఉత్పత్తులు పెంచాలి.

ఉమ్మడి జిల్లాలో 9,60,773 కుటుంబాలున్నాయి. ప్రతి కుటుంబం సగటున ఇంటి నిర్మాణాలకు నెలకు రూ.20 వేల వరకు వెచ్చించాల్సి వస్తుంది. కుటుంబ సభ్యులు పెరిగితే ఇంటి నిర్వహణ భారం పెరుగుతుంది. ఇందుకోసం అప్పులు చేయడం పరిపాటిగా మారుతుంది. వాటిని తీర్చేందుకు జీవితాంతం కష్టపడాల్సిన పరిస్థితి దాపురిస్తుంది.కుటుంబంలో సంతానం పరిమితికి లోబడి ఉంటే వారికి ఉన్నత విద్య, ఇతర సదుపాయాలు కల్పించడం సులభతరం అవుతుంది. నేటి కాలంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సంపాదన లేకపోవడంతో చాలామంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లలకు పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్యాభ్యాసం వరకు ఫీజుల భారం అధికంగా ఉంటోంది. ఇక ఇతర ఖర్చులు సరేసరి.

జనాభాకు అనుగుణంగా నివేశన స్థలాలు కావాల్సి ఉంటుంది. ఇందుకోసం అటవీ ప్రాంతాలను సైతం ఆక్రమించక తప్పని పరిస్థితి. కొన్నేళ్లు ఇలాగే జరిగితే అడవులు అంతరించి పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వాయు కాలుష్యం, నీటికాలుష్యం, సహజ వనరుల విధ్వంసం జరుగుతుంది.

నివేశన స్థలాల లభ్యత గగనం

ఉమ్మడి కరీంనగర్ జిల్లా మొత్తం 7,797 చదరపు కిలోమీటర్ల భూభాగంలో విస్తరించి ఉంది. ప్రస్తుత అంచనా ప్రకారం జనాభా 40 లక్షల వరకు ఉంది. ప్రతి చదరపు కిలోమీటరుకు 500 మంది వరకు నివసించాల్సి వస్తుంది. భవిష్యత్తులో నివేశన స్థలాల లభ్యత ఉంటుందా అనే అనుమానం తలెత్తుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 37.76 లక్షల మంది ఉమ్మడి జిల్లాలో ఉన్నారు. 2021 నాటికి వారి సంఖ్య 40 లక్షలకు పెరిగే అవకాశం ఉండగా 2024 సంవత్సరానికి 40.99 లక్షలకు చేరుకుంటుందని అంచనా. 2021లో జరగాల్సిన జనాభా లెక్కలను కొవిడ్ కారణంగా చేపట్టలేదు. దీంతో ఎంత జనాభా పెరిగిందన్న లెక్కలు అధికారికంగా లేవు. 2001 లెక్కలను పరిగణలోకి తీసుకుని అంచనా వేస్తున్నారు. గతంలో కంటే గడచిన 14 ఏళ్లలో జననాల సంఖ్య అధికంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రుల్లో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేపడుతున్నాం. ఇప్పుడే పిల్లలు వద్దనుకునే వారికి సూదిమందు సైతం అందుబాటులో ఉంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ సూదిమందు వేయించుకుంటే పిల్లలు పుట్టే అవకాశం ఉండదు. కుటుంబ నియంత్రణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. కొత్తగా వివాహం చేసుకున్నవారు డాక్టర్లను సంప్రదించి సలహాలు తీసుకోవచ్చు.పమోద్‌కుమార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి, పెద్దపల్లి జిల్లా

# ఆగని గర్భవిచ్ఛిత్తి దందా!

కరీంనగర్ : పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న కొందరు తమ తీరు మార్చుకోవడం లేదు.. కాసుల కోసం నిబంధనలను తోసిరాజంటున్నారు.. నైతికంగానూ సమర్థించలేని విధంగా ఇష్టానుసారంగా గర్భవిచ్ఛితి చర్యలకు పాల్పడుతున్నారు.. ఉన్నతాధికారుల ఆదేశాలు, గతంలో కేసులు నమోదైనా ఇవేవీ తమకు పట్టవనే పంథాలో సాగుతున్నారు. కరీంనగర్ జిల్లాలో భ్రూణ హత్యల దందా ఇంకా రహస్యంగానే జరుగుతుందనేందుకు తాజాగా హుస్నాబాద్ పోలీసులు హుజూరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిపై నమోదు చేసిన కేసే ఉదాహరణ. ఈ ఒక్క సంఘటన మాత్రమే వెలుగులోకి రాగా.. లోలోపల రహస్యంగా జరుగుతున్న వాటి విషయంలో ఎలాంటి చర్యలుండటం లేదు. గతంలోనూ కరీంనగర్‌లో ఒకే ఆస్పత్రిపై పలుమార్లు దాడులు చేసి కేసులు నమోదు చేసినా తరువాత అదే పంథాలో గర్భవిచ్ఛిత్తిలను కొనసాగించిన సందర్భాలున్నాయి. జమ్మికుంటలోని ఓ ఆసుపత్రిలో గర్భస్థ లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని గతేడాది మేలో వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం హుజూరాబాద్ వ్యవహారంతో మరోసారి కొన్ని ఆస్పత్రుల్లో సాగుతున్న అక్రమ వ్యవహారాల బాగోతం బయటకొచ్చింది.ఏం జరిగిందంటే..

దాదాపు అయిదు నెలల కిందట హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ గర్భాన్ని రహస్యంగా హుజూరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తొలగించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఓ ఆర్‌ఎంపీతోపాటు ఆ ఆస్పత్రిలో పని చేసే నర్సు, ల్యాబ్‌లో పనిచేసే ఒకరిద్దరు సహకరించారని వారిపై హుస్నాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలిని బలవంతంగా ఒప్పించి గర్భాన్ని తొలగించారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హుజూరాబాద్‌లో గత కొన్ని రోజులుగా విచారణ జరిపారు. తీరా ఇక్కడి ప్రైవేటు ఆస్పత్రిలోనే ఈ అక్రమ తంతు జరిగిందని నిర్ధారించుకుని ఈ దుశ్చర్యకు పాల్పడిన పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

తీరు మారడం లేదు..!

వైద్యారోగ్యశాఖ ఎప్పటికప్పుడు తనిఖీలు, పర్యవేక్షణలు చేపడుతున్నప్పటికీ భ్రూణ హత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. కొన్ని చోట్ల గర్భాన్ని తొలగించడం తోపాటు ముందుగానే పుట్టబోయే బిడ్డా.. ఆడా మగా అనే విషయాన్ని కూడా స్కానింగ్ సమయంలో రహస్యంగా వెల్లడిస్తున్నారు. ఇందుకోసం కోడ్ భాషను వాడుతూ.. విషయం చెప్పినందుకు దండిగానే కాసులు వసూలు చేస్తున్నారు. ఆడ బిడ్డ అని తెలియగానే కొందరు గర్భవిచ్ఛిత్తికి ప్రయత్నిస్తున్నారు. ఏదైనా ఘటన వెలుగులోకి వచ్చినప్పుడు హడావుడి చేస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు తరవాత పర్యవేక్షణ పట్టించుకోకపోవడంతో కొన్ని స్కానింగ్ కేంద్రాలు, ఆస్పత్రుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి ఆస్పత్రి వద్ద లింగనిర్ధారణ చేయకూడదనే విధంగా చట్టంలోని అంశాలతో బోర్డులను సంబంధిత ఆస్పత్రి ఏర్పాటు చేయాలి. కానీ చాలా చోట్ల ఇవి కనిపించడంలేదు. పైగా ఇలా చేస్తున్న క్రమంలో ఎవరికి ఫిర్యాదు చేయాలనే వివరాలేవీ అందుబాటులో ఉండటం లేదు. ఈ విషయమై వైద్యారోగ్యశాఖ ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరముంది.

భ్రూణహత్య కేసులో మరో ముగ్గురి అరెస్టుభ్రూణ హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సీఐ కొండ్రు శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తోట మహేశ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ‘హుస్నాబాద్‌కు చెందిన సుమేరాబేగంని స్థానికంగా ఉండే రాంరెడ్డి ఏడాది క్రితం వివాహం చేసుకున్నారు. వేర్వేరు మతాలు కావడంతో వీరి వివాహాన్ని తల్లిదండ్రులు, బంధువులు ఇష్టపడలేదు. ఈ క్రమంలోనే గర్భం దాల్చిన సుమేరాబేగం ఆరోగ్యం బాగా లేదని పుట్టింటికి వెళ్లగా ఆసుపత్రిలో చూపిస్తామని తల్లిదండ్రులు ఆమెను హుజురాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి గర్భ విచ్ఛిత్తి చేయించారు.

# అదే రూటు.. అయినా రైట్ రైట్



హైదరాబాద్:రాజధానిలో ఆర్టీసీ బస్సు తిరోగమనంలో ప్రయాణం చేస్తోంది. వేలాది మంది ప్రయాణించే రూట్లలో బస్సులు ఉండటం లేదు. పెద్దగా బస్సులు ఎక్కని రూట్లలో మాత్రం ఒకదాని వెనుక మరొకటి పరుగులు తీస్తున్నాయి. ప్రతి మూడేళ్లకు ఆర్టీసీ అధికారులు రూట్ సర్వే చేసి ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే కొత్త మార్గాల్లో బస్సులను తిప్పాల్సి ఉంది. కానీ దశాబ్దాల క్రితం ప్రారంభించిన రూట్లలోనే బస్సులను తిప్పుతున్నారు. నగరంలోని అత్యంత కీలక ప్రాంతాల వైపు సిటీబస్సులు వెళ్లకపోవడంతో సాధారణ ప్రజలకు క్యాబ్‌లు, బైకులు, ఆటోలే దిక్కవుతున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రత్యేక కథనం.

బస్సెక్కని అధికారులు

ఏ రూట్‌లో కొత్తగా బస్సులు నడపాలి, ప్రస్తుతం నడుస్తున్న సర్వీసులను కొంతదూరమైనా రూటు మారిస్తే అధిక ఆదాయం వస్తుందా అనే సర్వేలు కూడా సరిగా జరగడం లేదనే విమర్శలను ఆర్టీసీ మూటగట్టుకుంటోంది. బస్సుల రూట్‌లపై ప్రతిపాదనలు తయారుచేసి నిర్ణయాలు తీసుకునే డిపో మేనేజర్లు(డీఎం), రీజినల్ మేనేజర్(ఆర్‌ఎం)లు నాలుగైదు రోజులకు ఒకసారైనా సాధారణ ప్రయాణికుల్లా సిటీ బస్సుల్లో ప్రయాణిస్తే వాస్తవ సమస్యలు తెలిసే అవకాశముంది. కానీ వారికి ఆర్టీసీ సంస్థ కార్లు కేటాయించడంతో సిటీ బస్సుల్లో ప్రయాణించడం అరుదుగా మారింది. వారికి క్షేత్రస్థాయి సమస్యలు సరిగా తెలియవని, తాము చెప్పినా కనీసం శ్రద్ధగా వినరని ఓ కండక్టర్ వ్యాఖ్యానించారు.

ఇదీ పరిస్థితి

మెట్రో స్టేషన్ల కింద అవకాశం ఉన్నా ఆర్టీసీ బస్సులను ఆపడం లేదు. ఉదాహరణకు కూకట్‌పల్లి, ఎర్రగడ్డ నుంచి కోఠి వచ్చే సిటీ బస్సులను ఆపడానికి అమీర్‌పేట మెట్రో స్టేషన్ కింద ప్రత్యేకంగా బస్ బే కూడా నిర్మించారు. అయినా నిలపడం లేదు.

ఇటు బీహెచ్‌ఈఎల్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, అటు హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఎన్టీఆర్ గార్డెన్స్, నెక్లెస్ రోడ్ రూట్లలో సిటీబస్సులు లేక ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. కనీసం ఆ రూట్‌లో వెళ్లడానికి అటు నాంపల్లి, ఇటు అమీర్‌పేట నుంచి లింకు బస్సులైనా లేకపోవడం గమనార్హం.గతంలో కొన్ని పెద్ద కాలనీల నుంచి ప్రత్యేకంగా బస్సులను నడిపేవారు. అత్తాపూర్, ఎర్రమంజిల్‌లోని కొన్ని కాలనీల నుంచి తిప్పేవారు. కరోనా తరువాత ఈ బస్సులను తిప్పడం మానేయడంతో స్థానికులు ఇబ్బంద లు పడుతున్నారు.

ఆరాంఘర్, అత్తాపూర్ వైపు నుంచి ప్రయాణికులు పంజాగుట్ట నిమ్స్ వైపు రావాలంటే ప్రత్యేకంగా బస్సులు లేవు. ఎల్బీనగర్‌లో బయలుదేరిన బస్సు ఆరాంఘర్ మీదుగా మెహిదీపట్నం రైతు బజారు దగ్గర ఆగిపోతుంది. అక్కడి నుంచి ఇటు పంజాగుట్ట వైపు వెళ్లాలంటే రైతు బజారు దగ్గర దిగి రెండు బస్సులు మారాల్సి వస్తోంది. మెహిదీపట్నం రైతు బజారు నుంచి కూకట్‌పల్లి, లింగంపల్లి, సికింద్రాబాద్ వంటి అనేక ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ బంజారాహిల్స్, పంజాగుట్ట మీదుగానే పంపిస్తున్నారు. నేరుగా నిమ్స్ మీదుగా నడపడం లేదు.

హయత్‌నగర్, ఎల్బీ నగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల నుంచి నిత్యం 156, 218 వంటి నంబర్లతో అనేక బస్సులు బోరబండ, కూకట్‌పల్లి, లింగంపల్లి, పటాన్‌చెరు ప్రాంతాలకు వెళ్తుంటాయి. ఈ రూటు సర్వీసులను ఎప్పుడో కొన్ని దశాబ్దాల క్రితం ప్రారంభించారు. ఈ మార్గంలో కొంతమేర మెట్రో రైలు కూడా వచ్చింది. అయినా బస్సు రూటును మార్చకపోవడం గమనార్హం.

హయత్‌నగర్, ఎల్బీ నగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల నుంచి నిత్యం కోఠి ఉమెన్స్ కాలేజీ స్టాప్ వరకూ అనేక బస్సులు నడుస్తున్నాయి. చాదర్‌ఘాట్ నుంచి కోఠి ఉమెన్స్ కాలేజీ స్టాఫ్ వరకూ నిత్యం విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. అదే రూటులో హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌ల నుంచి బోరబండ, కూకట్‌పల్లి, లింగంపల్లి, పటాన్‌చెరు ప్రాంతాలకు వెళ్లే లాంగ్‌రూట్ 156, 218 వంటి నంబర్ల బస్సులను కూడా తిప్పుతున్నారు. ఈ రూటు సర్వీసులను ఎప్పుడో కొన్ని దశాబ్దాల క్రితం ప్రారంభించారు. వీటిని చాదర్‌ఘాట్ వంతెన నుంచి గౌలిగూడ సాయిబాబా గుడి మీదుగా కోఠి మీదుగా మళ్లిస్తే ప్రయోజనం ఉంటుంది.మెహిదీపట్నం నుంచి పెద్దసంఖ్యలో సిటీబస్సులు సికింద్రాబాద్ వైపు వెళుతున్నా వాటిని లక్డీకాపూల్ బస్టాపులో అపడం లేదు. వాటిని నేరుగా టెలిఫోన్ భవన్ వద్ద నిలుపుతున్నారు. దీంతో అమీర్‌పేట నుంచి లక్డీకాపూల్ వరకు వచ్చిన బస్సుల్లో దిగిన ప్రయా ణికులు సెక్రటేరియేట్, రాణిగంజ్, సికింద్రాబాద్ వైపు వెళ్లడానికి మెహిదీపట్నం నుంచి వచ్చే బస్సులను ఎక్కడానికి వీల్లేకుండా పోతోంది. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌లో దిగేవారు పంజాగుట్ట వైపు వెళ్లే బస్సు ఎక్కాలంటే ఖైరతాబాద్ బస్టాప్ వరకూ నడవాల్సి వస్తోంది. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ కింద ఆపే అవకాశం ఉన్నా ఆపడం లేదు.

# కార్యాచరణ సరే .. భూములే కొరత



హైదరాబాద్: పరిశ్రమల విస్తరణ.. డాటా కేంద్రాల ఏర్పాటు.. ఐటీ సంస్థల రాక.. గృహ, వాణిజ్య, మాల్స్ నిర్మాణాల దూకుడుతో విద్యుత్తు వినియోగం ఏటేటా పెరుగుతోంది. ప్రస్తుతం సిటీలో 5వేల మెగావాట్ల డిమాండ్‌ను తట్టుకునేలా విద్యుత్తు ఉపకేంద్రాలు, లైన్లు ఉన్నాయి. ఈ ఏడాది వేసవిలో గరిష్ఠంగా 4352 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను తట్టుకునేలా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు డిస్కం సన్నద్ధమవుతోంది. విద్యుత్తు డిమాండ్ అధికంగా ఉంటున్న రంగారెడ్డి జిల్లాలో కొత్తగా 25 చోట్ల విద్యుత్తు ఉపకేంద్రాల ఏర్పాటు అవసరం ఉందని అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో తమకు 1500 నుంచి 2000 చదరపు గజాల ప్రభుత్వ స్థలాలను ప్రజాప్రయోజనాల రీత్యా కేటాయించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు టీజీఎస్పీడీసీఎల్ ఆర్‌ఆర్ జోన్ చీఫ్ ఇంజినీర్ లేఖ రాశారు. హైదరాబాద్ పరిధిలోని మెట్రోజోన్, మేడ్చల్ జోన్ నుంచి ఆయా జిల్లా కలెక్టర్లకు విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని కోరారు. మెట్రోజోన్‌కు 18, రంగారెడ్డి జోన్‌కు 25, మేడ్చల్ జోన్‌కు 18 చొప్పున కొత్తగా 33కేవీ ఉపకేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు.మేడ్చల్ జోన్ పరిధిలో.. మేడ్చల్ జోన్‌లో కొత్తగా ప్రతిపాదించిన 18 ఉపకేంద్రాలకు గాను 5 చోట్ల స్థలాలు అందుబాటులో ఉన్నాయి. మరో 13 ఉపకేంద్రాలకు భూములు కేటాయించాలని మేడ్చల్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్లకు సీఈ లేఖ రాశారు. ఒక్క సంగారెడ్డి సర్కిల్‌లోనే కొత్తగా 10 విద్యుత్తు ఉపకేంద్రాలను వచ్చే ఐదేళ్లకోసం ప్రతిపాదించారు. మెట్రోజోన్‌లోనూ 18 ఉపకేంద్రాలకు స్థలాలు కావాలని హైదరాబాద్ కలెక్టర్‌ను కోరారు.

కార్యాలయాల ఏర్పాటుకూ..

ఒక్కో ఉపకేంద్రానికి 1500 నుంచి 2000 చదరపు గజాల భూముల అవసరమని ఇంజినీర్లు చెబుతున్నారు. అవుట్‌డోర్ 33/11కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం ఎక్కువ స్థలాన్ని డిస్కం కోరుతుంది. భవిష్యత్తులో విస్తరణను బట్టి ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు కార్యాలయాల ఏర్పాటుకూ స్థలాలను కోరుతున్నారు. డిస్కం గుర్తించిన స్థలాల్లో రెవెన్యూశాఖ, అటవీ, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలకు చెందినవి ఉన్నాయి.

మంచిరేవుల సర్వేనెం. 283లో దాదాపు 6 ఎకరాలు కేటాయించాలని.. అక్కడ 220/132/33కేవీ ఈహెచ్‌టీ ఉపకేంద్రానికి స్థలం కేటాయించాలని సీఈ కలెక్టర్‌ను కోరారు.

భవిష్యత్తు డిమాండ్ మేరకు..

నగరంలో విద్యుత్తు డిమాండ్ ఏటా 15 నుంచి 20 శాతం దాకా ఉంటుంది. గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో విద్యుత్తు లోడ్ పెరగడంతో అదనంగా 11కేవీ ఫీడర్లు ఉన్నాయి. ఇప్పుడున్న 33/11కేవీ ఉపకేంద్రాలపై లోడు పెరిగే కొద్దీ ఒత్తిడి పెరుగుతుంది. సుదూర ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం వల్ల పంపిణీ నష్టాలు ఎక్కువ. భవిష్యత్తు డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను విద్యుత్తు అధికారులు గుర్తించారు. జాబితాను రూపొందించి కలెక్టర్లకు అందజేశారు.

రంగారెడ్డిలో ఎక్కడెక్కడ..

సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో బొటానికల్‌గార్డెన్, నెక్నాంపూర్, నల్లగండ్ల హుడా, హఫీజ్‌పేట్, 8వ బెటాలియన్, మంచిరేవుల ప్రాంతాలు అనువైనవని.. అక్కడ స్థలాలు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో అత్యధిక కొత్త ఉపకేంద్రాలకు భవిష్యత్తులో డిమాండ్ ఉంటుందని అంచనా వేశారు. ఇక్కడ 14చోట్ల స్థలాల అవసరం ఉంది. హిమాయత్‌సాగర్ పీ అండ్ టీ కాలనీ, హిమాయత్‌సాగర్, కిస్మత్‌పూర్, సాతంరాయి, గగన్‌పహాడ్, అలీనగర్, రాళ్లగూడ, శంషాబాద్ టౌన్ హుడాకాలనీ, మీరాలం పార్క్, రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయం సమీపంలో, కాటేదాన్ కింగ్స్ కాలనీ, జల్‌పల్లి, గౌస్‌నగర్, బండ్లగూడ 2బీహెచ్‌కే ప్రాంతాల్లో స్థలాల అవసరం ఉందని లేఖలో పేర్కొన్నారు.

సరూర్‌నగర్ సర్కిల్ ఫతుల్లాగూడ ఎస్‌టీపీ, కుంట్లూరు, బీఎన్‌రెడ్డినగర్, బడంగ్‌పేట్ డంపింగ్ యార్డ్, మన్సురాబాద్ పెద్దచెరువు ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు స్థలాల అవసరం ఉందని కోరారు.

# పంచాయతీరాజ్‌లో బదిలీల జాతర

కొత్తగూడెం : పంచాయతీరాజ్ శాఖలో ఎట్టకేలకు బదిలీల జాతర ప్రారంభమైంది. ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పీఆర్ శాఖలోనూ స్థానచలనాలు కలగనున్నాయి. చివరగా 2012లో ఈశాఖలో బదిలీలు జరిగాయి. వివిధ ప్రభుత్వ శాఖల్లో 2018లో బదిలీల ప్రక్రియ చేపట్టారు. సర్పంచి, ఎంపీటీసీ స్థానాల ఎన్నికల కారణంగా ఆ ఏడాది పంచాయతీరాజ్ శాఖలో బదిలీలు నిలిచిపోయాయి. అక్కడ్నుంచి ఉద్యోగులంతా యథాతథ స్థానాల్లోనే కొనసాగుతున్నారు. జిల్లా పరిషత్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు, జిల్లా పంచాయతీ కార్యాలయం, ఇంజినీరింగ్ విభాగం, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల బోధనేతర సిబ్బంది, మిషన్ భగీరథ ఉద్యోగులు కొన్నేళ్లుగా బదిలీల కోసం నిరీక్షిస్తున్నారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలు 2016లో ఏర్పడినా వాటిల్లో జడ్పీలు ఏర్పాటైంది మాత్రం 2019లోనే. వాటిల్లో అదే ఏడాది ‘ఆర్డర్ టు సర్వ్’ కింద పలువురు ఉద్యోగులకు పోస్టింగులు కల్పించి సర్దుబాటు చేశారు. వీరంతా తాజా బదిలీలకు అర్హులే. నాలుగో తరగతి ఉద్యోగులు, రికార్డ్ అసిస్టెంట్లు, టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల కేటగిరీ వారీగా బదిలీ జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పలువురు ఎంపీడీవోలకు ఇటీవల స్థానచలనాలు జరిగాయి. ప్రస్తుతం వారిని పరిగణనలోకి తీసుకోవడం లేదు.

18 వరకు దరఖాస్తుల పరిశీలన

ఒకేచోట నాలుగేళ్లకు పైగా పనిచేస్తున్న నిబంధనతో శాఖలోని సుమారు 40 శాతం మందికి త్వరలో బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇదే క్రమంలో మరికొందరు దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా మినహాయింపు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈనెల 12 లోపు దరఖాస్తులు స్వీకరించనుండగా, 13 నుంచి 18 వరకు వాటిని పరిశీలించనున్నారు. అనంతరం నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ జరగనుంది. చివరకు మాస్టర్ జాబితాను రూపొందించి 19, 20వ తేదీల్లో బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

# పల్లెల్లో ప్రబలుతున్న జ్వరాలు

ధర్మారం: ధర్మారం మండలంలో జ్వరాలు పంజా విసురుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇప్పటికే కొత్తూరు, బంజరుపల్లి, పత్తిపాక, బుచ్చయ్యపల్లి గ్రామాల్లో అయిదుగురికి డెంగీ నిర్ధారణ అయింది. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నా, జ్వరాలు నియంత్రణలోకి రావడం లేదు. పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతుండగా, చాలా మంది అధికారులు మాతృ శాఖల విధులతో తీరిక లేక గ్రామాలకు వెళ్లడం లేదు. దీనికి తోడు నిధుల కొరత కారణంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం లేదు. జ్వర బాధితులు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు అధికారులు డెంగీ బాధితుల నివాస ప్రాంతాల్లో మాత్రమే దోమల నివారణపై దృష్టి సారిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఖర్చు ఎక్కువవుతుండటంతో బాధితులు నందిమేడారం పీహెచ్‌సీకి వస్తున్నారు. ఇక్కడ సిబ్బంది కొరత సమస్యగా మారింది.

సిబ్బంది కొరత.. సమన్వయ లోపం

నందిమేడారం పీహెచ్‌సీకి నిత్యం వివిధ గ్రామాల నుంచి 60 నుంచి



100 మంది వరకు రోగులు వస్తున్నారు. ఇద్దరు వైద్యులకు గాను ప్రస్తుతం డా.సుష్మిత ఒక్కరే ఉన్నారు. మరో వైద్యుడు డా.అనుదీప్ గర్రెపల్లి పీహెచ్‌సీకి డిప్యుటేషన్‌పై వెళ్లారు. స్టాఫ్‌నర్సు కూడా ఒక్కరే ఉన్నారు. గతంలో ప్రసవ సేవలందించడానికి ఒకరు, ఎన్‌సీడీ విభాగానికి ఒకరు.. కలిపి మొత్తం ముగ్గురుండేవారు. ఇద్దరికి ఇటీవల నర్సింగ్ అధికారులుగా ఉద్యోగాలు రావడంతో వెళ్లారు. ఫార్మసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్ అందుబాటులో ఉన్నారు. ఆయుష్ విభాగం వైద్యుడు డా.అమర్‌నాథ్ ఎలిగేడు, అప్పన్నపేట ఆసుపత్రులకు ఇన్‌ఛార్జిగా ఉండటంతో వారంలో రెండు రోజులు మాత్రమే ఉంటున్నారు. మండలంలో పది ఉప కేంద్రాలకు కేవలం బొమ్మారెడ్డిపల్లి, దొంగతుర్తి, కటికెనపల్లి కేంద్రాలకు మాత్రమే ఒకటో ఏఎన్‌ఎంలు ఉన్నారు. ఏడు ఖాళీలున్నాయి. రెండో ఏఎన్‌ఎంలు 9 మంది ఉన్నారు. గ్రామాల్లో రెండో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతోనే నెట్టుకొస్తున్నారు. పీహెచ్‌సీలో పని చేస్తున్న సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడం వైద్య సేవలపై ప్రభావం చూపుతోంది. కొందరు చుట్టపు చూపుగా మాత్రమే విధులకు వస్తుండగా, ఇక్కడ పని చేసి వెళ్లిన ఓ వైద్యుడు వివాదాలకు ఆజ్యం పోస్తున్నారని ఆరోపణలున్నాయి.

జ్వరం మొదలవగానే వస్తే మేలు


నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ సహా అన్ని రకాల జ్వరాలకు చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. జ్వరం మొదలు కాగానే ఆసుపత్రికి వస్తే బాగుంటుంది. అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరమైన వారికి పరీక్షలు చేస్తున్నాం. మందులకు ఎలాంటి కొరత లేదు. గ్రామాల్లో జ్వర బాధితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాం.సుస్మిత, వైద్యాధికారి

# వసతి సమస్యలు

సారంగాపూర్: సారంగాపూర్ కేజీబీవీలో మౌలిక వసతులు కొరవడడంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాలయంలో పదో తరగతి వరకు ఉండగా ప్రభుత్వం ఇంటర్ వరకు పొడిగించింది. ప్రస్తుత భవనంలో పూర్తిస్థాయిలో వసతులు లేకపోగా గతేడాది ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రెండు గ్రూపులలో ప్రవేశాలు తీసుకున్నారు. అప్పటికే 200 మంది బాలికలతోపాటు ఇంటర్‌లో చేరినవారికి వసతి కల్పించారు. ప్రథమ సంవత్సరం కావడంతో తక్కువ మంది మాత్రమే చేరడంతో నెట్టుకొచ్చారు. ఈ ఏడాది అదనంగా ఇంటర్‌లో మరో 60 మంది చేరడంతో ఓ వైపు తరగతి, భోజనం, పడుకోవడం ఒకే గదిలో చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీర్‌పూర్ బాలికలకు ఇక్కడే..బీర్‌పూర్ మండలానికి కస్తూర్బా విద్యాలయం మంజూరు కావడంతో అక్కడ వసతులు సమకూర్చే వరకు సారంగాపూర్ కేజీబీవీలో ప్రవేశాలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం దాదాపు 50 మందికి పైగా విద్యార్థినులు చేరారు. అందరికీ వసతులు కల్పించలేక అవస్థలు పడుతున్నారు. బీర్‌పూర్‌లో నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనాలకు మరమ్మతు చేసి తరలిస్తామని ప్రకటించిన అధికారులు ఇప్పటికీ చర్యలు చేపట్టడం లేదు. త్వరితగతిన తరలిస్తేనే ఉన్న విద్యార్థులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

పనిచేయని శుద్ధ జలప్లాంట్



విద్యాలయానికి అందించిన శుద్ధ జల ప్లాంట్ ఏళ్లుగా మరమ్మతు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారింది. మిషన్ భగీరథ పైపులైన్ వేసి గేట్ వద్దనే వదిలివేయగా నీరు రావడంలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అపరిశుభ్రత నీటిని తాగితే రోగాల భారినపడే అవకాశం ఉందని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా డైనింగ్ హాల్ లేకపోవడంతో కింద కూర్చోని తినాల్సి వస్తోంది. ఇంటర్ వరకు పెంచడంతో గదులతోపాటు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరముంది.

ఉన్నతాధికారులకు నివేదించాం

కస్తూర్బాలో ఉన్న సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బీర్‌పూర్‌లో మరమ్మతు చేపట్టే వరకు సారంగాపూర్‌లోనే వసతి కల్పించేలా చూడాలని కోరారు. దీనికి అనుగుణంగా ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తున్నాం. ఇబ్బందులు ఎక్కువగా ఉంటే వెంటనే తరలించేలా చర్యలు తీసుకుంటాం.భీమయ్య, మండల విద్యాధికారి

# మానేరులో ఇసుక తవ్వకాలపై ఎన్జీటీ కొరడా!

పెద్దపల్లి : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మానేరు నది పరీవాహక ప్రాంతాల్లో పర్యావరణ అనుమతి (ఈసీ) లేకుండా నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఇసుక తవ్వకాలపై జాతీయ హరిత ట్రెబ్యునల్ (ఎన్జీటీ) కొరడా ఝుళిపించింది. మంగళవారం ఎన్జీటీ చెన్నై సౌత్ బెంచ్ ఇచ్చిన తీర్పు ప్రకారం మానేరు నదిలో చెక్‌డ్యాంల నిర్మాణం కోసం ఇసుక పూడికతీత పనుల పేరిట తవ్వకాలు జరిపేందుకు అనుమతి ఇచ్చిన నీటిపారుదల, భూగర్భ గనుల శాఖలకు రూ.25 కోట్ల జరిమానా విధించింది. ఈ జరిమానాను మూడు నెలల్లోగా గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు చెల్లించాలని ఆదేశించింది. మానేరులో ఇసుక తవ్వకాలను నిలిపివేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. ఈ విషయమై భూగర్భ, గనులశాఖ పెద్దపల్లి జిల్లా అధికారి శ్రీనివాస్‌తో మాట్లాడగా ఎన్జీటీ ఉత్తర్వులిచ్చింది వాస్తవమేనని అయితే పూర్తిస్థాయి మార్గదర్శకాలు ఇంకా రాలేదని తెలిపారు.

అసలేం జరిగింది?

తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం కరీంనగర్‌లో 12 రీచుల్లో 1,16,38,246 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లి జిల్లాలో 23 రీచుల్లో 1,97,95,841 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాల కోసం గుత్తేదారులకు అనుమతి ఇచ్చారు. మొత్తంగా రెండు జిల్లాల్లో కలిపి 3.14 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుకను తీయాల్సి ఉండగా అంతకు రెట్టింపు ఇసుక తరలింపు ప్రక్రియ జరిగిందనే ఆరోపణలు వినిపించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ రీచ్‌ల్లో జరిగిన అక్రమాలపై దృష్టి సారిస్తామని చెప్పడంతో పాటు విజిలెన్స్, అనిశా అధికారులతో ఆ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి లెక్కలను వెలికి తీస్తామని ప్రకటించింది. మానేరు నదిలో చెక్‌డ్యాంల నిర్మాణం పేరిట ఇసుక తవ్వకాలు



జరపడం పర్యావరణ విధ్వంసానికి కారణమవుతుందని, పర్యావరణ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారంటూ ఎన్జీటీలో అయిదు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు మానేరు ఇసుక తరలింపును నిలిపి వేయాలని ఎన్జీటీ మధ్యంతర ఉత్తర్వులు సైతం జారీ చేసింది. అయినా తవ్వకాలు, రవాణా ఆగడం లేదని మానేరు పరిరక్షణ సమితి, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ఆరోపించగా గుత్తేదారులు మాత్రం తాము తవ్వకాలు చేయడం లేదని, గతంలో తవ్వి స్టాక్ యార్డుల్లో నిల్వ ఉంచిన ఇసుక మాత్రం రవాణా చేస్తున్నామని చెబుతూ వచ్చారు. తవ్వకాలపై ఫిర్యాదులు కొనసాగడంతో విచారణ జరిపిన ఎన్జీటీ నీటిపారుదల, భూగర్భ గనుల శాఖ అధికారులకు జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది.

# విడుదలకు ఉత్తర్వులు... అందని ప్రోత్సాహకాలు

గోదావరిఖని : ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో వసతులను మెరుగుపరుస్తూ ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ అష్యూరెన్సు స్టాండర్డ్స్) పోటీలను 2013 నుంచి నిర్వహిస్తోంది. రోగులకు సేవలు, నిర్వహణ, పారిశుద్ధ్యం, తదితర అంశాల్లో మూడు స్థాయిల్లో పరిశీలించాక ఎన్‌క్వాస్ ధ్రువీకరణకు ఎంపిక చేస్తారు. ఎన్‌క్వాస్‌నకు ఎంపికైన ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు వరుసగా మూడేళ్ల పాటు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించనుండగా గత రెండేళ్లుగా అందడం లేదు. ఎట్టకేలకు మార్చి 12న ఎన్‌క్వాస్‌నకు ఎంపికైన ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు ప్రోత్సాహకాలను విడుదల చేస్తున్నట్లుగా తెలంగాణ రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయగా ఎన్నికల నేపథ్యంలో నిధుల విడుదలలో జాప్యం నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో 29 కేంద్రాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 29 ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలు ఎన్‌క్వాస్ ధ్రువీకరణకు ఎంపికయ్యాయి. జగిత్యాలలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి, పెద్దపల్లిలోని జిల్లా ఆసుపత్రి, హుజూరాబాద్, వేములవాడ, సిరిసిల్లలోని ప్రాంతీయ ఆసుపత్రులు, సుల్తానాబాద్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మూడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 11 పల్లె దవాఖానాలు 'ఎన్‌క్వాస్' ధ్రువీకరణకు ఎంపికయ్యాయి.

ప్రోత్సాహకాల తీరు ఇదీ...

పూర్తి స్థాయిలో ఎన్‌క్వాస్ ధ్రువీకరణకు ఎంపికైన ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు వరుసగా మూడేళ్ల పాటు ప్రోత్సాహకాలు అందిస్తారు. షరతులతో కూడిన ధ్రువీకరణకు ఎంపికైన వాటికి కేవలం సంవత్సరం మాత్రమే ప్రోత్సాహకం అందిస్తారు. పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ సామాజిక ఆరోగ్య కేంద్రం షరతులతో ఎన్‌క్వాస్ ధ్రువీకరణకు ఎంపిక కావడంతో ఒకే సంవత్సరం రూ. 87,500 చెల్లించాల్సి ఉంది. ప్రాంతీయ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను బట్టి ఒక్కొక్క పడకకు రూ.10 వేల చొప్పున మూడేళ్ల పాటు చెల్లిస్తారు. సార్వజనిక ఆసుపత్రిలో 'లక్ష్య' నిబంధనల ప్రకారంగా ఆపరేషన్ థియేటర్ నిర్వహణ తీరునకు రూ.3 లక్షలు, ప్రసూతి గది నిర్వహణకు రూ.3 లక్షల చొప్పున మూడేళ్ల పాటు చెల్లిస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.3 లక్షలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.2 లక్షలు, పల్లె దవాఖానాలకు రూ.1.5 లక్షల చొప్పున మూడేళ్ల పాటు చెల్లిస్తారు. ఇందులో 25 శాతం నిధులను ఆయా ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రోత్సాహకంగా చెల్లించనుండగా మిగతా 75 శాతం నిధులను ఆసుపత్రిలో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు ఉపయోగించుకోవాల్సి ఉంటుంది.

ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే నిధుల విడుదల

ఎన్నికల నిర్వహణ, కోడ్ కారణంగా నిధుల విడుదలలో జాప్యం నెలకొంది. ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే నిధులు విడుదలయ్యే అవకాశముంది. ఎన్‌క్వాస్ ప్రోత్సాహకాలు అందించాల్సిందిగా ఎప్పటికప్పుడు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, పెద్దపల్లి

# గాబరా పెడుతూ.. నాసివి అంటగడుతూ..



వికారాబాద్: తొలకరి ఇంకా ప్రారంభం కాలేదు. అప్పుడే కొందరు విత్తన వ్యాపారులు అన్నదాతలను పరుగులు పెట్టిస్తున్నారు. పత్తి విత్తనాల కోసం రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుని కృత్రిమ కొరతకు తెర తీస్తున్నారు. పేరెన్నిక గల కంపెనీల విత్తనాలు దొరకడం లేదని ముందుగానే కొని దగ్గరుంచుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో అమాయక రైతులు విత్తనం నాసి రకమా, నాణ్యత కలిగిందా అనే విషయం కూడా గమనించలేక కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు అప్రమత్తమై తనిఖీలు ముమ్మరం చేయాల్సిన అవసరాన్ని పేర్కొంటూ కథనం.

మద్దతు ధర కలిసి వస్తుందని ఆశ

నాలుగేళ్ల అనుభవాల దృష్ట్యా ఈ వానాకాలం సీజన్‌లో అత్యధికంగా పత్తి పంట వేయడం వైపే జిల్లా రైతులు మొగ్గు చూపుతున్నారు. పత్తి క్వింటాలు ప్రభుత్వ మద్దతు ధర రూ.6,080 ఉండటం, బహిరంగ విపణిలో ధర రూ.6,500 పైచిలుకు పలకడంతో అధిక శాతం రైతులు పత్తి సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. 2022లో జిల్లాలో దిగుబడి తగ్గినా గరిష్ఠంగా పత్తి క్వింటాలుకు రూ.9,500 అమ్ముడుపోయింది.

పొంచిఉన్న బీటీ -3 బెడద

రైతుకు కావాల్సినవి లభించకపోవడంతో బీటీ -3 విత్తనాల బెడద పొంచి ఉంది. కలుపు పెద్దగా ఉండదని పురుగు మందుల ఖర్చులు తగ్గుతాయని ప్రచారం చేయడంతో గతేడాది కర్నూలు, రాయలసీమ, ఆంధ్రా ప్రాంతం నుంచి కూడా వివిధ గ్రామాలకు పంపిణీ అయ్యాయి.

అసలు రూ.864.. విక్రయం.. రూ.2,000

జిలాలలో ఒక్కో ప్యాకెట్ పత్తి విత్తన ధర వాస్తవానికి రూ.864 ఉండగా రూ.1500 నుంచి రెండువేలకు పైగా విక్రయిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ డివిజన్ల పరిధిలో 523 మందికి విత్తన లైసెన్సులు ఉన్నాయి.

పట్టుకుంటున్నా కనిపించని మార్పు

అధిక ధరలకు పత్తి విత్తనాలు అమ్మడం, కొన్నిచోట్ల నాసిరకం విక్రయించడంతో అధికారులు తనిఖీల్లో ప్రతిసారీ కేసులు నమోదవుతున్నాయి. జిల్లా వ్యవసాయ శాఖకు దౌల్తాబాద్, కొడంగల్, యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ ప్రాంతాల్లో పట్టుబడిన నాసిరకం విత్తన ఉదంతాలే ఇందుకు తాజా ఉదాహరణ. సుమారు రూ.36లక్షల విలువ చేసే రూ.23క్వింటాళ్ల నాసిరకం పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నా మార్పు రావడంలేదు.

కొన్ని కంపెనీలకు చెందిన విత్తనాల పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వ్యాపారులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. పల్లెల్లో ఇది జోరుగా సాగుతోంది.

అనుమతులు రద్దు చేస్తాం

-గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి.

గతంలో కంటే ఈసారి అధిక విస్తీర్ణంలో పత్తి, కంది పంటలు సాగయ్యే అవకాశం ఉంది. ఇందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. నాసిరకం విత్తనాలు విక్రయిస్తే వ్యాపారుల లైసెన్సును రద్దు చేస్తాం. ప్రస్తుతం 1.10లక్షల విత్తనాలు అందుబాటులో ఉంచాం. జిల్లాలోని నాలుగు డివిజన్లలో డివిజన్‌కు ఒకటి చొప్పున ఇంటర్నల్ స్క్వాడ్ బృందాలు కూడా పనిచేస్తున్నాయి. రైతులు సైతం మెలకువతో మెలగాలి.

# వర్షపు నీటినీ తాగొచ్చు





హైదరాబాద్: నగరంలో కురుస్తున్న వాన నీటిలో కొంతైనా భూమిలోకి ఇంకించినా.. ఫిల్టర్ చేసి వాడుకున్నా.. నగరవాసులకు నీటి కష్టాలే ఉండవు. నగరంలో సరాసరి వర్షపాతం 850 మిల్లీమీటర్లు. హెచ్‌ఎండీఏ పరిధిలో 7,200 చదరపు కిలోమీటర్ల మేరకు ఏటా కురుస్తున్న వాన నీళ్లు 15 టీఎంసీలకు సమానమని నిపుణులు చెబుతున్నారు. ఇందులో 5శాతం కూడా భూమిలోకి ఇంకించడం, అవసరాలకు వాడుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఆలోచన ఉండాలనే కానీ.. ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసి పట్టవచ్చు. భూమిలోకి ఇంకించడమే కాకుండా.. ఫిల్టర్ చేసి వంటకు, తాగడానికీ వాడుకోవచ్చు. వాక్ ఫర్ వాటర్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.కరుణాకర్‌రెడ్డి కర్మన్‌ఘాట్‌లోని తన కార్యాలయంలో ఈ విధానాన్ని అమలు చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నగరంలో చాలామంది ఇలానే వాననీటితో లబ్ధిపొందుతున్నారని తెలిపారు.

అతి తక్కువ ఖర్చుతోనే..

ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటి సంరక్షణకు అతి తక్కువ ఖర్చుతోనే ఏర్పాటు చేసుకోవచ్చు. ఇళ్లు, అపార్ట్‌మెంట్లపై పడే వర్షపు నీటిని కిందికి పంపే పైపులకు సంపు ప్రాంతంలో చిన్న ఫిల్టర్ పెట్టి సంపులోకి మళ్లించాలి. ఫిల్టర్ ఖరీదు రూ.3 వేలతోపాటు ప్లంబర్ ఖర్చులు మాత్రమే చెల్లించాలి. వాన నీళ్లు అత్యంత స్వచ్ఛమైనవి. డాబాపై పడిన తర్వాత అందులోకి వ్యర్థాలు చేరుతాయి. వాటిని ఫిల్టర్ వడబోసి.. స్వచ్ఛమైన నీటిని సంపులోకి పంపుతుంది. తర్వాత సంపులో ఒకటి, రెండు క్లోరిన్ మాత్రలు కలిపి ఇంట్లో తాగడానికి, వంటకు ఉపయోగించవచ్చునని కరుణాకర్‌రెడ్డి తెలిపారు. తొలుత 5 నిమిషాలు వర్షపు నీటిని సంపులోకి కాకుండా బయటకు విడిచి పెట్టడంతో ఏదైనా చెత్త ఉంటే పూర్తిగా పోతుంది. తర్వాత సంపులోకి మళ్లించాలి.

భారీగా వాన నీటి ఆదా..

ఏటా నగరంలో 850 మిల్లీమీటర్ల వరకు వాన కురుస్తుంది. ఈ లెక్కన ఒక చదరపు మీటరు స్థలంలో ఏటా 850లీటర్ల వర్షపు నీరు చేరుతుంది. అదే వెయ్యి చదరపు మీటర్ల ఇంటి పైకప్పుపై ఏటా 85వేల లీటర్ల వరకు వాన నీటిని ఆదా చేయవచ్చు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. మణికొండ, నానక్‌రాంగూడ, గచ్చిబౌలి, మియాపూర్, కొండాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్‌నగర్ ప్రాంతాల్లో 33 వేల బోర్లు ఎండిపోయినట్లు జలమండలి గుర్తించింది. ఇందులో సగం ఇళ్లల్లో వర్షపు నీటి సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోలేదని గుర్తించింది.

ఏడాదంతా బోర్లు ఎండకుండా..- ఎం.కరుణాకర్‌రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు, వాక్ ఫర్ వాటర్ సంస్థ

ఈ విధానంతో ఇళ్లు, కాలనీల్లో వర్షపు నీటిని ఆదా చేయచ్చు. పార్కులు, కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో ఇంకుడు గుంతలు తవ్వి వాన నీటిని వాటిలోకి మళ్లించడం ద్వారా బోర్లు ఇంకే పరిస్థితి ఉండదు. బోరుకు కొంత దూరంలో ఇంజక్షన్‌వెల్ తవ్వి అందులోకి ఈ విధానంలో వర్షపు నీటిని మళ్లించడం ద్వారా ఏడాది అంతా బోర్లు ఇంకిపోవు.

# ఔటర్ చుట్టూ.. ఔరా అనిపించేలా

రాష్ట్రంలో కొత్తగా ఐటీ సంస్థలు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం శరవేగంగా ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఔటర్ చుట్టూ వాటిని ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రభుత్వ భూములను సేకరించేందుకు రెవెన్యూ అధికారుల కసరత్తు చేస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఔటర్‌కు సమీపంలోని కొన్ని ప్రాంతాలు, విమానాశ్రయానికి దగ్గరగా ఉండే మరికొన్ని ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించారు. కృత్రిమమేధపై పరిశోధనలు పెంచేందుకు 200 ఎకరాల్లో ఏఐసీటీ, నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. వాటన్నింటికీ అవసరమైన ప్రభుత్వ భూములను సేకరించాలని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు సమాలోచనలు చేస్తున్నారు. గతంలో ఏవైనా సంస్థలు, పరిశ్రమలకు స్థలాలు ఇచ్చి అవి ఇంకా కార్యకలాపాలు ప్రారంభించకపోతే వాటిని వెనక్కి తీసుకునేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభుత్వం దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లనున్నారు.

అన్నింటికీ అనుకూలంగా ఉండేలా... ప్రభుత్వం కేటాయించే భూములు అన్నింటికీ అనుకూలంగా ఉండేలా రెవెన్యూ అధికారులు చూస్తున్నారు. శేరిలింగంపల్లి, మహేశ్వరం, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం మండలాల పరిధుల్లో స్థలాలను పరిశీలించారు. ఒక్కోచోట వెయ్యి ఎకరాలకు తక్కువ కాకుండా సేకరించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. దీంతోపాటు ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్) తరహాలో ఒకేచోట 300 ఎకరాల భూములు సేకరించాలని, పరిశ్రమలు, ఐటీ సంస్థలకు సమీపంలో ప్రభుత్వ స్థలాలను అభివృద్ధి చేస్తే అక్కడ నివాసం ఉండేందుకు వీలుంటుందని రెవెన్యూ అధికారుల భావిస్తున్నారు.



ఇందుకోసం 300 గజాల చొప్పున ప్లాట్లుగా విభజించాలని నిర్ణయించారు. మిషన్ భగీరథ, జలమండలి అధికారులతో చర్చించి ఇళ్లు, ఆపార్ట్‌మెంట్ల నిర్మాణం ప్రారంభమైనప్పుడే తాగునీరు, మురుగు నీటి వ్యవస్థను అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేయనున్నారు.

ఫాక్స్‌కాన్... టెక్స్‌టైల్స్ హబ్ తరహాలోరంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో ఫాక్స్‌కాన్ సంస్థ ఆపిల్ ఫోన్ విడిభాగాల తయారీ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టింది. మహేశ్వరం మండలం తుక్కుగూడలో ఎలక్ట్రానిక్ సిటీ బాగా ప్రాచుర్యం పొందింది. ఈరెండు పరిశ్రమలతో పాటు షాబాద్ మండలంలో విద్యుత్ బస్సుల తయారీ, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఇప్పటికే తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఐటీ, పరిశ్రమల హబ్‌లో పరిశ్రమలు, ఐటీ సంస్థలతో పాటు వాటికి సమీపంలో విద్యా సంస్థలు, వినోద కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు, రెస్టారెంట్లను ప్రారంభిస్తే నాలుగైదేళ్లలోనే అక్కడ కూడా అభివృద్ధి పెరిగి మహానగరం తరహాలో అభివృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నారు.

# ఏళ్ల తరబడి అపరిష్కృతం

గోదావరిఖని : ఎన్నికల ప్రచారంలో నాయకులు రాష్ట్ర, జాతీయ సమస్యలకే ప్రాధాన్యం ఇస్తుండటంతో స్థానిక అవసరాలు తీరడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పలు సమస్యలు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉంటున్నాయి. వాటిని నెరవేర్చడానికి ఇప్పటికైనా పాలకులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

కలగానే భూతల ఓడరేవు

సుల్తానాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో భూతల ఓడరేవు(డ్రైపోర్టు) నిర్మాణానికి 2008లో కాంకర్(కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సర్వే నిర్వహించింది. 2009లో సాధ్యాసాధ్యాల నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఓవైపు రైల్వే ట్రాక్, మరోవైపు రాజీవ్ రహదారి, సమీపంలోనే బసంత్‌నగర్ విమానాశ్రయం ఉండటంతో కాంకర్ అధికారులు ఇక్కడే డ్రైపోర్టు కోసం యత్నాలు చేపట్టారు. వ్యవసాయ భూములను కోల్పోతామంటూ రైతులు ఆందోళనకు దిగడంతో కాంకర్ సంస్థ వెనుకడుగేసింది. ఇదే అదనుగా ఇతర జిల్లాల నాయకులు తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఆర్మూర్‌కు తరలించుకుపోయారు. అక్కడ కూడా పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా డ్రైపోర్టును తిరిగి తీసుకురాగలిగితే ఓడరేవుతో సంబంధం లేకుండా ఇక్కడి నుంచే ఇతర దేశాలకు ఎగుమతులు, దిగుమతులు చేసుకోవచ్చు. ఈ ప్రాంత అభివృద్ధితో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

సర్వేకే పరిమితమైన రైల్వే లైన్

పెద్దపల్లి మండలం రాఘవాపూర్ మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వరకు రామగుండం-మణుగూరు రైల్వే లైన్ నిర్మాణానికి 1999లో కేంద్రం సర్వే చేయించింది. దీనికి కోల్‌కారిడార్‌గా నామకరణం చేసింది. 2013-14లో రూ.10 కోట్ల నిధులు విడుదల చేయడంతో ప్రాజెక్టు నిర్మాణంపై ఆశలు చిగురించాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ ఈ మార్గం ఆవశ్యకతను పేర్కొన్నారు. దీనికి సమాంతరంగా భద్రాచలం రోడ్డు-కొవ్వూరు రైలు మార్గానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపి గతేడాది రూ.20 కోట్లు విడుదల చేసింది. కోల్‌కారిడార్ ద్వారా సింగరేణి ప్రాంతాల అనుసంధానంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధికి బాటలు పడతాయి. రైల్వే శాఖ ప్రతిపాదించిన ఈ మార్గంలో ప్రాథమికంగా మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాల్‌రావుపేటల్లో స్టేషన్లను గుర్తించారు. 197 కిలోమీటర్లు కలిగిన ఈ మార్గం పూర్తయ్యే నాటికి కొవ్వూరు మార్గం కూడా పూర్తయ్యే అవకాశముంటుంది. ఈ రెండు మార్గాలు పూర్తయితే రామగుండం నుంచి విశాఖపట్టణానికి రవాణా మార్గం అందుబాటులోకి వస్తుంది. మణుగూరు నుంచి భద్రాచలం రోడ్డుకు ఇప్పటికే కోల్ రవాణా ట్రాక్ ఉంది.

కార్మికులకు కలగానే ఐటీ మినహాయింపు

సింగరేణి కార్మికుల చిరకాల స్వప్నం ఆదాయ పన్ను మినహాయింపు. ప్రమాదకర పరిస్థితుల్లో బొగ్గు ఉత్పత్తి విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఐటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని చాలా ఏళ్లుగా కోరుతున్నారు. ప్రతి ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇస్తున్నా నెరవేరడం లేదు.

జాతీయ రహదారి లేని జిల్లాకేంద్రం

పెద్దపల్లి జిల్లాకు ఇప్పటివరకు ఒక్క జాతీయ రహదారితోనూ అనుసంధానం లేదు. మంచిర్యాల నుంచి వరంగల్ మీదుగా ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ ప్రక్రియ భూసేకరణ దశలో ఉండగా, జగిత్యాల-పెద్దపల్లి-మంథని-కాటారం రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలనే ప్రతిపాదన ఉంది. ప్రధానమైన రాజీవ్ రహదారి(ఎస్‌హెచ్-1), రాయపట్నం రోడ్డు(ఎస్‌హెచ్-7) రాష్ట్ర రహదారులు కాగా ఎన్‌హెచ్ ప్రమాణాలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పైవంతెనలు, పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల్లో సర్వీసు రోడ్లు లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ప్రశ్నార్థకంగా కొత్త గనులు

సింగరేణి విస్తరించి ఉన్న ఆరు జిల్లాల పరిధిలో బొగ్గు నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నా కొత్త గనులు ఏర్పాటు చేసుకోవాలంటే వేలంలో పాల్గొనక తప్పదు. ఈ మేరకు కేంద్రం మూడేళ్ల కిందట ఎంఎండీఆర్(ది మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్) చట్టం తీసుకొచ్చింది. నిక్షేపాల అన్వేషణతో పాటు గనుల ఏర్పాటుకు అవసరమైన ప్లానింగ్ పూర్తి చేసి, నివేదికలు సిద్ధం చేసుకున్న సింగరేణికి కేటాయింపులు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండటం నిరాశకు గురి చేస్తోంది. కొత్త చట్టం ప్రకారం దేశంలో ఎక్కడి బొగ్గు గనినైనా వేలం ద్వారానే పొందాల్సి ఉంటుంది. దీంతో సింగరేణికి ప్రస్తుతం కొత్త గనులు లేక విస్తరణ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పటివరకు కేంద్రం నిర్వహించిన వేలంలో ఈ ప్రాంతంలోని నాలుగు గనులను చేర్చారు. అందులో ఒక గనికి ప్రైవేటు సంస్థ బిడ్డింగ్ వేయడంతో దానికే కేటాయించారు.

# రైతుల కల నెరవేరేదెన్నడో..?

ఎల్లారెడ్డిపేట : మెట్ట ప్రాంతమైన రాజన్న సిరిసిల్ల జిల్లాలో గొట్టపుబావులు, బావులే వ్యవసాయానికి ప్రధాన ఆధారం. సాగునీటి కొరత నెలకొనడం ఈ ప్రాంతంలో సర్వసాధారణం. ఎగువ మానేరుకు పునరుజ్జీవం పోసే కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. సుమారు 86 వేల ఎకరాలకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు 16 ఏళ్లుగా కొన'సాగు'తూనే ఉన్నాయి. అక్కడక్కడ భూసేకరణలో అడ్డంకులు ఎదురవుతుండగా మరికొన్ని చోట్ల పనులు నత్తను తలపిస్తున్నాయి. దీంతో రైతుల సుదీర్ఘ కల నెరవేరేదెన్నడో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పనులను వేగవంతం చేయడం ద్వారా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేస్తేనే అన్నదాతలకు మేలు చేకూరనుంది. కరవు నేల సస్యశ్యామలం కానుంది.

మల్కపేట వరకు పూర్తి

ఎగువ మానేరు కింద ఉన్న 26 వేల ఎకరాల పాత ఆయకట్టు స్థిరీకరణతోపాటు కొత్తగా 60 వేల ఎకరాలు కలుపుకొని మొత్తం 86 వేల ఎకరాలకు సాగునీటిని అందించడమే లక్ష్యంతో 2008లో ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపుగా మరో 60 వరకు గొలుసుకట్టు చెరువులు జలకళను సంతరించుకునేలా ప్రాజెక్టును రీ డిజైన్ చేశారు. మధ్యమానేరు నుంచి ఎగువ మానేరు వరకు 9వ ప్యాకేజీ కింద రూ.996 కోట్లు, మల్కపేట రిజర్వాయర్ నిర్మాణానికి రూ.543 కోట్లతో అంచనాలు రూపొందించారు. మధ్యమానేరు నుంచి రగుడు బైపాస్ రోడ్డు వద్ద 12 కిలోమీటర్ల టన్నెల్ (సొరంగమార్గం), ఆ తర్వాత మల్కపేటలో సర్జిపూల్, పంప్‌హౌస్ నిర్మాణాలు పూర్తయ్యాయి. రెండు మోటర్లతో 3 టీఎంసీ సామర్థ్యంగల మల్కపేట రిజర్వాయర్‌లో గతంలో 1 టీఎంసీ నీటిని నింపారు.

సింగసముద్రం చెరువు ఆధునికీకరణ

నైజాం కాలంలో నిర్మించిన సింగసముద్రం చెరువు గతంలో ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. వచ్చే అరకొర నిధులతో కొంతమేర పనులు చేసినా ఫలితం లేకుండా పోయింది. కాళేశ్వరం 9వ ప్యాకేజీ పథకంలో ఆ చెరువు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఆధునీకరించారు. మత్తడిని 33 మీటర్ల ఎత్తుకు పెంచారు. పాతమత్తడి, బందీస్(పురాతన ఆనకట్ట)లకు స్కిన్‌వాల్ నిర్మించారు. కట్టను మూడు మీటర్ల ఎత్తుకు పెంచి ఆరు మీటర్ల వెడల్పు చేశారు. పథకం పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం పెరగడంతోపాటు దాదాపు ఏడు గ్రామాలు జలకళ సంతరించుకుంటాయి.

ఈ పనులు ప్రధానంమల్కపేట నుంచి సింగసముద్రం చెరువు వరకు కాల్వ నిర్మాణంలో 18.3 కిలోమీటర్ల దూరానికి గాను మధ్యలో బ్రిడ్జిల వద్ద 200 మీటర్ల లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయిసింగసముద్రం చెరువు నుంచి గంభీరావుపేట మండలంలోని ముస్తఫానగర్ బట్టల చెరువు వరకు 5.6 కిలోమీటర్ల మే పైపులైన్ వేశారు. పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోస్తే పైపులైన్ ద్వారా బట్టల చెరువులోకి నీరు చేరుతుంది.మల్కపేట నుంచి సింగసముద్రం వరకు ప్రధాన కాల్వ మధ్యలో అయిదు ఉపకాల్వ (డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్)ల నిర్మాణాలు భూసేకరణ సమస్యతో నిలిచిపోయాయి.




## ఉప ఎన్నికల్లో 'ఇండియా' కూటమి జోరు.. 2 సీట్లకు పరిమితమైన భాజపా

సార్వత్రిక ఎన్నికల తర్వాత అధికార, విపక్షాలకు తొలి పరీక్షగా భావించిన అసెంబ్లీల ఉప ఎన్నికల్లో 'ఇండియా కూటమి' జయకేతనం ఎగురవేసింది. దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో విపక్ష కూటమి 10 చోట్ల విజయం సాధించింది. భాజపా రెండు స్థానాలకు పరిమితమైంది. మరో చోట స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. పశ్చిమ బెంగాల్‌లోని 4, హిమాచల్ ప్రదేశ్‌లోని మూడు, ఉత్తరాఖండ్‌లోని రెండు, పంజాబ్, బిహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లోని ఒక్కో స్థానానికి జులై 10న ఉప ఎన్నిక పోలింగ్ జరిగింది. ఇందులో నాలుగు రాష్ట్రాల్లో ఇండియా కూటమి అధికారంలో ఉండగా.. మరో మూడుచోట్ల ఎన్డీయే ప్రభుత్వం ఉంది. శనివారం కౌంటింగ్ చేపట్టి ఫలితాలను ప్రకటించారు.

**సీఎం సతీమణి విజయం..** హిమాచల్ ప్రదేశ్‌లోని దేహ్రాలో రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు సతీమణి, కాంగ్రెస్ అభ్యర్థి కమలేశ్ ఠాకూర్ విజయం సాధించారు. తన సమీప భాజపా అభ్యర్థిపై 9వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నాలాగఢ్ స్థానంలో కాంగ్రెస్ నేత హర్‌దీప్ సింగ్ బవా 8,990 ఓట్ల తేడాతో భాజపా అభ్యర్థిపై విజయం సాధించారు. ఇక, హమీర్‌పుర్ స్థానంలో భాజపా అభ్యర్థి ఆశీష్ శర్మ గెలుపొందారు.

**బెంగాల్‌లో తృణమూల్ క్లీన్‌స్వీప్..** పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొంది జోరుమీదున్న తృణమూల్ కాంగ్రెస్.. తాజా ఉప ఎన్నికల్లోనూ హవా కొనసాగించింది. ఇక్కడ రాయ్‌గంజ్, రాణాఘాట్, బాగ్దా, మాణిక్‌తలా.. నాలుగు స్థానాల్లోనూ టీఎంసీ అభ్యర్థులు విజయం సాధించారు. ఇక, ఉత్తరాఖండ్‌లో మంగలౌర్, బద్రీనాథ్ స్థానాలను కాంగ్రెస్ దక్కించుకుంది.

**పంజాబ్ బైపోల్ ఆప్‌దే..** పంజాబ్‌లోని జలంధర్ స్థానంలో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి మోహిందర్ భగత్ విజయం సాధించారు. తన సమీప భాజపా అభ్యర్థి శీతల్‌పై 37వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. తమిళనాడులోని విక్రావండి స్థానంలో డీఎంకే అభ్యర్థి అన్నియుర్ శివ విజయం సాధించారు. మధ్యప్రదేశ్‌లోని అమర్‌వాడాలో భాజపా నేత కమలేశ్ షా గెలుపొందారు. బిహార్‌లోని రూపౌలి స్థానంలో స్వతంత్ర అభ్యర్థి శంక్ సింగ్ జయకేతనం ఎగురవేశారు.




ఢిల్లీ: అమరవీరుడి భార్యపై అభ్యంతరకర పోస్టు పెట్టిన ఓ నెటిజన్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శనివారం దీనిపై కేసు నమోదైంది. జాతీయ మహిళా కమిషన్ చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. ఆ కామెంట్లు చేసిన నెటిజన్ అకౌంట్ వివరాల కోసం సంబంధిత సోషల్ మీడియా సంస్థను సంప్రదించినట్లు తెలిపారు.

**ఇంతకీ ఏం జరిగిందంటే..?** :ేశం కోసం ప్రాణాలు అర్పించిన భారత సైనికుడు అంశుమాన్ సింగ్ త్యాగానికి గుర్తుగా భారత ప్రభుత్వం కీర్తి చక్ర అవార్డును ప్రకటించింది. ఇటీవల ఆయన సతీమణి స్మృతిసింగ్ రాష్ట్రపతి చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

ఆ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో యావత్ భారతదేశం అమరవీరుడి కుటుంబాన్ని కీర్తించింది. అవార్డు స్వీకరించే సమయంలో స్మృతి ముఖం చూసిన దేశ ప్రజల కళ్లు చెమర్చాయి. కానీ కొందరు మాత్రం ఆ వీడియోపై అభ్యంతరకర కామెంట్లు పెట్టడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది.

**నా భర్త ఓ హీరో!** : ఢిల్లీకి చెందిన అహ్మద్ అనే వ్యక్తి అసభ్యకరంగా చేసిన కామెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు జాతీయ మహిళా కమిషన్‌ను కోరారు. దీనిపై స్పందించిన మహిళా కమిషన్ ఆ యువకుడి చర్యను తీవ్రంగా ఖండించింది. ఢిల్లీ పోలీసులు తక్షణమే అతడిని అరెస్టు చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

26వ బెటాలియన్ పంజాబ్ రెజిమెంట్‌కు చెందిన కెప్టెన్ అంశుమాన్ సింగ్ గతేడాది జులై 19న విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. సియాచిన్‌లో వారు ఉంటున్న బేస్ క్యాంప్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో చిక్కుకొన్న జవాన్లను కెప్టెన్ ధైర్యంగా కాపాడి బయటకు తీసుకొచ్చారు. అగ్నికీలలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తూ తీవ్ర గాయాలపాలై మరణించారు. ఆయన శౌర్యానికి గుర్తుగా కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర అవార్డును అందించింది.

## ఆ ముగ్గురినీ అరెస్టు చేసి కస్టడీలో విచారించాలి: ఎమ్మెల్యే రఘురామ



అమరావతి: ఎంపీని అపహరించి, చంపాలని చూసిన వారిని కఠినంగా శిక్షించాలని ఉండి తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు... రాష్ట్ర డీజీపీ, హోం మంత్రిని కోరారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కస్టడీలో విచారించాలన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.." నా వద్ద ఉన్న ఆధారాలన్నీ కేసు విచారణ అధికారికి అందజేస్తా. ప్రాథమిక విచారణ పూర్తయ్యే వరకు నిందితులను బయటకు వదలొద్దు. సాక్షులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. అప్పటి వైద్యులపై ఒత్తిడి చేయకుండా పోలీసులు నిఘా పెట్టాలి. హైకోర్టు జడ్జి సమక్షంలోనే మిలిటరీ ఆసుపత్రి వైద్యులు నివేదిక సిద్ధం చేశారు. హింసించడం వల్లే వేలు విరిగిందని, రక్తస్రావమైందని నివేదికలో ఉంది. ఆధారాలు ఉంటే ఎప్పుడైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు. కొట్టిన వారిని గుర్తుపట్టలేదని గతంలో చెప్పిన మాట నిజమే. కొట్టేందుకు కుట్ర పన్నింది జగన్, సీతారామాంజనేయులు, సునీల్. కేసు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఐపీఎస్ సునీల్ ప్రయత్నిస్తున్నారు. గత నెల 10న గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశా. అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్ నివేదికను తారుమారు చేశారు" అని రఘురామ వివరించారు. రఘురామ కృష్ణరాజు ఫిర్యాదు మేరకు.. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన హయాంలో సీఐడీ విభాగాధిపతిగా పనిచేసిన పీవీ సునీల్‌కుమార్, నిఘా విభాగాధిపతిగా వ్యవహరించిన పీఎస్ఆర్ ఆంజనేయులు సహా మరికొందరిపై గుంటూరు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.




అమరావతి: మంచి చేయాలనుకునేవారికి ఇక స్పీడ్ బ్రేకర్లు ఉండవని సీఎం చంద్రబాబు తెలిపారు. గుంటూరు జిల్లా కొలనుకొండలోని హరేకృష్ణ గోకుల క్షేత్రంలో నిర్వహించిన అనంతశేష స్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వేంకటేశ్వర ఆలయ నిర్మాణంలో భాగంగా ఇక్కడ అనంతశేష స్థాపన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "మంచి చేసే వారందరికీ ఆంధ్రప్రదేశ్ చిరునామాగా ఉంటుంది. మంచి చేసే వారంతా ఏపీలో ఇక ముందుకు రావాలి. అక్షయపాత్ర స్ఫూర్తితో అతి త్వరలో అన్న క్యాంటీన్లను పునఃప్రారంభిస్తాం. హరేకృష్ణ సంస్థ దైవసేవతో పాటు మానవ సేవను సమానంగా చేస్తోంది. ఆధ్యాత్మికత ద్వారా వచ్చే మానసిక ఆనందం లేకపోతే ముందుకెళ్లలేం. దైవత్వాన్ని అందరిలో పెంపొందించేలా అక్షయ పాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధుపండిత్ కృషి చేస్తున్నారు. 50 మంది ఐఐటీ పట్టభద్రులు సేవా కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయం. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే ఆధ్యాత్మిక సేవలనూ కొనసాగించాలి. వేంకటేశ్వరస్వామి దయతోనే బాంబు పేలుళ్ల నుంచి బయటపడ్డా. ప్రపంచానికి సేవలందించే అవకాశం కోసమే నాకు తిరిగి ప్రాణభిక్ష పెట్టారు. పేదరికం లేని సమాజ నిర్మాణమే అందరి నినాదం కావాలి. అక్షయపాత్ర ద్వారా ప్రతిరోజు 22 లక్షల మందికి భోజనం పెడుతున్నారు. అన్న క్యాంటీన్లను చిన్న ఫిర్యాదు లేకుండా అక్షయపాత్ర నిర్వహించింది" అని చంద్రబాబు తెలిపారు.

**హరేకృష్ణ సంస్థకు రూ.3 కోట్లు విరాళం** : హరేకృష్ణ సంస్థకు అన్నదానానికి దాతలు రూ.3 కోట్లు విరాళం ప్రకటించారు. పారిశ్రామికవేత్త పెనుమత్స శ్రీనివాస్‌రాజు రూ.కోటి విరాళం అందజేశారు. పూర్ టు రిచ్ స్ఫూర్తితో వంద కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు చెప్పారు. హరేకృష్ణ సంస్థకు సక్కు గ్రూపు రూ.కోటి విరాళం, యలమంచిలి కృష్ణమోహన్ గ్రూపు రూ.కోటి విరాళం అందించాయి. శ్రీనివాస్‌రాజు, కృష్ణమోహన్, సక్కు గ్రూప్‌ను సీఎం చంద్రబాబు అభినందించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక భూముల ధరలు పెరిగాయని తెలిపారు.

## ఓవైపు ఆషాడ మాసం.. మరోవైపు భారీ వర్షం... వెరసి భారీగా ట్రాఫిక్ జామ్



విజయవాడ, జూలై 13: నగరంలోని భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నగరంలో నిన్నటి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో రోడ్లపై వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. దీంతో రోడ్లపై చేరిన వర్షపు నీటిని అధికారులు తొలగిస్తున్నారు. వర్షం కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. మరోవైపు ఆషాడ మాసం కావడంతో ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తుతున్నారు. అమ్మవారికి సారె సమర్పించేందుకు భారీగా భక్తులు తరలివస్తున్నారు. భారీ వర్షాల కారణంగా కొండ చర్యలు విరిగి పడతాయనే నేపథ్యంలో ఘాట్ రోడ్‌ను అధికారులు నిలిపివేశారు. కనకదుర్గనగర్ నుంచి భక్తులు సారెను తీసుకెళ్తున్నారు. శుక్ర, శని, ఆదివారాలు వీకెండ్స్ కావడంతో భారీగా భక్తులు తరలివస్తున్నారు. భక్తుల తాకిడితో రోడ్లపైన వాహనలు నిలిచిపోతున్నాయి. ఇంద్రకీలాద్రికి సరైనటువంటి పార్కింగ్సౌ కర్యం లేకపోవడంతో భక్తులు రోడ్లపైనే వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

## జగన్ పాలనలో కడప ఉక్కు పరిశ్రమ అభివృద్ధి శూన్యం: భాజపా ఎంపీ సి.ఎం. రమేశ



ప్రొద్దుటూరు: అయిదేళ్ల జగన్ పాలనలో కడప ఉక్కు పరిశ్రమ ఒక్క శాతం కూడా అభివృద్ధి చెందలేదని భాజపా ఎంపీ సీఎం రమేశ్ విమర్శించారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. యువతకు ఉద్యోగాలు రావాలంటే కడప ఉక్కు పరిశ్రమ పూర్తి కావాలని పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లు జగన్ తన సంపాదనకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. రాష్ట్రంలోని పురపాలికల్లో ఎక్కడా.. ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదన్నారు. ప్రజలను భయపెట్టి ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి వసూళ్లకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఆయన సాగించిన అరాచకాలపై ప్రజలు ఫిర్యాదు చేస్తే వసూలు చేసిన డబ్బులు వెనక్కి వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ జిల్లాలో జరిగిన భూ దందాలపై త్వరలోనే విచారణ చేయిస్తామని తెలిపారు.

## నిజాయితీకి నిదర్శనం చంద్రబాబు అయితే... తాచుపాము జగన్



విజయవాడ, జూలై 13: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఉద్దేశించి వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేత బుద్దా వెంకన్న తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. మాజీ మంత్రులు పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్‌లు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు.


"మచిలీపట్నంలో అత్యధిక మెజారిటీతో నిన్ను, నీ కుమారుడిని ఓడించారు. ప్రజలు ఛీ కొట్టిన వీళ్లు చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారు" అంటూ మండిపడ్డారు.

**అందుకే ప్రజలు వైసీపీని తరిమికొట్టారు..** అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌గా చంద్రబాబు మారిస్తే... జగన్ అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని విరుచుకుపడ్డారు. ఆరు అడుగుల నిజాయితీకి నిదర్శనం చంద్రబాబు అని అన్నారు. ఐదు అడుగుల తాచుపాము జగన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ తాచుపాముకు తన మన బేధం లేదని.. ఎవరినైనా కాటేస్తాడని వ్యాఖ్యలు చేశారు. వైఎస్, జగన్‌లు ఎన్ని విచారణలు చేసినా చంద్రబాబు తప్పు చూపలేకపోయారన్నారు.

చివరికి తప్పుడు కేసులతో చంద్రబాబును జైలుకు పంపారన్నారు. దేశం మొత్తం, ఇతర దేశాల్లో స్థిరపడిన వారంతా బాబుకు మద్దతుగా నిలిచారని తెలిపారు. వైసీపీ చేసిన పిచ్చి పనులకు ప్రజలు వారిని తరిమి కొట్టారన్నారు. ఇంకా అబద్దాలతో ప్రజలను మాయ చేయాలని చూస్తున్నారన్నారని టీడీపీ నేత మండిపడ్డారు.


**వైసీపీ నేతల్లారా సిగ్గు తెచ్చుకోండి...** "పేర్ని నాని నీ కపట మాటలు మానుకుని బుద్ధి తెచ్చుకో. గుడివాడ అమర్నాథ్ సాక్షి పత్రికలో వచ్చినవే చెబుతాడు" అని విమర్శించారు. నెల రోజుల్లోనే రాష్ట్రంలో మార్పు తెచ్చిన మనిషి చంద్రబాబు అని కొనియాడారు. అధికారులతో సమీక్ష చేసి, శ్వేత పత్రాలు విడుదల చేస్తున్నారన్నారు. జగన్ ఐదేళ్లల్లో ఎప్పుడు అయినా అధికారులతో ఇలా మాట్లాడారా అని ప్రశ్నించారు. కమీషన్‌లు, కాంట్రాక్టులలో మామూళ్ల కోసం జగన్ మీటింగ్‌లు పెట్టారన్నారు. వైసీపీ నాయకుల్లారా సిగ్గు తెచ్చుకోండి... లేదంటే జనం తమిమి కొడతారని బుద్దా వెంకన్న హెచ్చరించారు.

## మంత్రి నారా లోకేశ చొరవ.. ఆగమేఘాల మీద డిగ్రీ కళాశాల సిబ్బందికి నియామక ఉత్తర్వులు



మదనపల్లె: మదనపల్లె బీటీ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని గత వైకాపా ప్రభుత్వం ఇబ్బందుల పాల్జేసిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. 23 నెలలుగా వారికి న్యాయబద్ధంగా అందాల్సిన నియామక ఉత్తర్వులు, జీతాలు ఇవ్వకుండా మానసిక వేదనకు గురి చేశారని మండిపడ్డారు. ఇదే విషయాన్ని ప్రజాదర్బార్‌లో తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దీంతో కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్‌కు సమస్య పరిష్కరించాలని సూచించినట్లు చెప్పారు. ఆయన ఆదేశాలతో ప్రిన్సిపల్ ఆగమేఘాలపై 32 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలతో వచ్చి తనను కలవాల్సిన అవసరం లేదని లోకేశ్ చెప్పారు. ప్రజల సమస్యలు పూర్తి వివరాలతో తన వ్యక్తిగత మెయిల్ ఐడీ hello.lokesh@ap.gov.in పంపించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు.

## అధికారంలోకి వచ్చేశామనే అలసత్వాన్ని నేతలు వీడాలి: సీఎం చంద్రబాబు



అమరావతి: అధికారంలోకి వచ్చేశామనే అలసత్వాన్ని నేతలు వీడాలని సీఎం చంద్రబాబు సూచించారు. తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ముఖ్య నేతలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. "మంత్రులు కూడా పార్టీ కార్యాలయానికి తరచూ రావడం సేవగా భావించాలి. రోజూ ఇద్దరు మంత్రులైనా వచ్చి కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి. వారిని పార్టీ కార్యాలయానికి తీసుకొచ్చే బాధ్యత జోనల్ ఇన్‌ఛార్జులదే. వినతులు స్వీకరించి వాటి పరిష్కారాన్ని మంత్రులంతా బాధ్యతగా తీసుకోవాలి. వినతుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

ప్రత్యేక వ్యవస్థతో పాటు ప్రత్యేక కమిటీ కూడా ఏర్పాటు చేస్తా. పార్టీ నేతలెవరూ వ్యక్తిగత దాడులు, కక్ష సాధింపులకు దిగొద్దు. వైకాపా చేసిన తప్పులే మనం చేస్తే.. వారికీ మనకు తేడా ఉండదు. తప్పు చేసిన వారిని చట్టపరంగానే శిక్షిద్దాం" అని చంద్రబాబు తెలిపారు.

**అక్రమ కేసులపై ఆరా** : గత ఐదేళ్లుగా తెదేపా కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసులను సీఎం చంద్రబాబు ఆరా తీశారు. చట్టపరంగానే వారికి ఎలా విముక్తి కలిగించాలన్న దానిపై చర్చించారు. తమ పరిధిలో నమోదైన కేసు ల వివరాలు నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పంపాలని ఆదేశించారు.


కేసులు పెట్టినా సక్రమంగా వ్యవహరించని అధికారుల వివరాలు ఇవ్వాలని కోరారు. సమర్థులందరికీ నామినేటెడ్ పదవులు దక్కుతాయని చంద్రబాబు తెలిపారు.

## చంద్రబాబు అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించడం శుభపరిణామం

అమరావతి: అమరావతి నగరంలో నూతన ఆధ్యాత్మిక ఒరవడికి శ్రీకారం చుట్టటం శుభసంకేతమని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. దేవాలయాల్లో కూడా రాజకీయాలు చొరబడి, ఆలయాలు నిర్మించకుండా చేసిన ప్రభుత్వాలను మనం చూశామన్నారు. దేవుడు ఉన్నాడు కాబట్టే ఎన్నో అవరాధాలు అధిగమించి గోకుల క్షేత్రం నిర్మాణానికి చంద్రబాబు సారధ్యంలో మార్గం సుగమమైందన్నారు. సమాజంలో ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతి, ఆచార వ్యవహారాలను కాపాడటం ఎంతో ముఖ్యమన్నారు. ఇందులో ఇస్కాన్ సంస్థ ముందుండటంతో పాటు ఎంతోమందికి అన్నదానం కూడా చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో అన్నా క్యాంటీన్లను సీఎం చంద్రబాబు ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించుడటం శుభపరిణామమని ఎన్వీ రమణ పేర్కొన్నారు. అక్షయపాత్ర ద్వారా గతంలో అన్న క్యాంటీన్లకు ఇస్కాన్ సంస్థ ఎంతో తోడ్పాటునిచ్చిందన్నారు. ఎవరూ అర్థాకలితో ఉండకూడదనే లక్ష్యంతో ఇస్కాన్ సంస్థ ఎంతోమందికి అక్షయపాత్ర ద్వారా అన్నదానం చేస్తోందన్నారు. అమరావతి నగరంలో నూతన ఆధ్యాత్మిక ఒరవడికి శ్రీకారం చుట్టటం శుభసంకేతమన్నారు. దేవాలయాల్లో కూడా రాజకీయాలు చొరబడి, ఆలయాలు నిర్మించకుండా చేసిన ప్రభుత్వాలను మనం చూశామని పేర్కొన్నారు. దేవుడు ఉన్నాడు కాబట్టే ఎన్నో అవరాధాలు అధిగమించి గోకుల క్షేత్రం నిర్మాణానికి చంద్రబాబు సారధ్యంలో మార్గం సుగమమైందని ఎన్వీ రమణ అన్నారు. సమాజంలో ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతి, ఆచార వ్యవహారాలను కాపాడటం ఎంతో ముఖ్యమని ఎన్వీ రమణ పేర్కొన్నారు. ఇందులో ఇస్కాన్ సంస్థ ముందుండటంతో పాటు ఎంతోమందికి అన్నదానం కూడా చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో అన్న క్యాంటీన్లను చంద్రబాబు ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించుడటం శుభపరిణామమని పేర్కొన్నారు. అక్షయపాత్ర ద్వారా గతంలో అన్న క్యాంటీన్లకు ఇస్కాన్ సంస్థ ఎంతో తోడ్పాటునిచ్చిందన్నారు. ఎవరూ అర్థాకలితో ఉండకూడదనే లక్ష్యంతో ఇస్కాన్ సంస్థ ఎంతోమందికి అక్షయపాత్ర ద్వారా అన్నదానం చేస్తోందని ఎన్వీ రమణ పేర్కొన్నారు.

## ఆలియా వయసు 31.. చీర వయసు 160

అనంత్ అంబానీ– రాధిక మర్చంట్ జంట వివాహం ట్రెండీ టాపిక్ అయింది. ముంబైలో జరిగిన ఈ పెళ్లి కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్ సెలబ్రిటీలు తరలి వచ్చారు. ఇందులో అంతర్జాతీయ పాప్ స్టార్లు, బాలీవుడ్ ప్రముఖుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరోవైపు చీర కట్టులో బాలీవుడ్ చక్కనమ్మల సందడి ఆషామాషీగా లేదు. ముఖ్యంగా ఈ పెళ్లిలో అలియా భట్ (31) రిఫ్రెష్ లుక్ ప్రస్తుతం ఇంటర్నెట్‌ని షేక్ చేస్తోంది. ఆలియా రొటీన్ కి భిన్నంగా చీరలో ప్రత్యక్షమైంది. సాంప్రదాయ చీర లుక్ కోసం ఆలియా రెగ్యులర్ గా ఉపయోగించే లెహంగాలు, చోళీలను లైట్ తీస్కుంది. రొటీన్ కి భిన్నంగా ఒక వైవిధ్యమైన చీరను ఎంచుకుంది. నిజానికి పెళ్లి కోసం ఆలియా ధరించినది కేవలం ఒక చీర కాదు.. అది పాతకాలపు కళాఖండం. జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో అనంత్ అంబానీ – రాధిక మర్చంట్‌ల పెళ్లికి విచ్చేసిన కళ్లన్నీ ఆలియా చీరపైనే



వాలిపోయాయి అంటే అతిశయోక్తి కాదు. ఈ చీరలో ఆలియా అంత అద్భుతంగా కనిపించింది. నిజానికి అలియా భట్ సాధారణంగా నేటి ట్రెండ్స్, స్టైలింగ్‌కు అంబాసిడర్ తరహా. పాతకాలపు సాంప్రదాయకమైన విధానంలో కనిపించడం అరుదు. కానీ తనదైన సంతకం కోసం ఆలియా కొత్తశైలిలో కనిపించింది. నిజానికి పెళ్లి కోసం ఆలియా కట్టిన చీర 160 ఏళ్ల నాటిది. ఈ చీర డిజైన్ కోసం నిజమైన బంగారం, వెండిని ఉపయోగించారని తెలిసింది. ఫంక్షన్‌కు వచ్చిన ఎ-లిస్టర్‌లందరిలో అలియా భట్ – రణబీర్ కపూర్ తమ ఎథ్నిక్ వేర్‌లో అల్టిమేట్ పవర్ కపుల్‌గా కనిపించారు. అలియా క్వీన్ పింక్ చీరలో స్ట్రాప్‌లెస్ బ్లౌజ్‌తో కనిపించింది. తను ధరించిన భారీ ఆభరణాలు సొగసైన కేశాలంకరణ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 160 ఏళ్ల క్రితం నేసిన ఆశావళి చీర గుజరాత్‌లో స్వచ్ఛమైన పట్టు 99 శాతం స్వచ్ఛమైన వెండితో కూడిన నిజమైన జరీ బార్డర్ తో రూపొందించినది. ఇన్‌స్టా పేజీ డైట్ సభ్యా ప్రకారం... చీరలో ఈ అద్భుతమైన రీగల్ లుక్‌ని అందించడానికి సుమారు 6 గ్రాముల బంగారాన్ని ఉపయోగించారు. చీర మనీష్ మల్హోత్రా ఆర్కైవల్ వీవ్ సేకరణలో భాగం. భారీ డైమండ్ సెట్‌తో ఆలియా లుక్ ని డిజైన్ చేయడం ఆసక్తికరం. డైమండ్ నెక్లెస్, మ్యాచింగ్ చెవిపోగులు, మాంగ్ టిక్కా స్టేట్‌మెంట్ తో ఆలియా సరికొత్తగా కనిపించింది.

## బాత్ టబ్ లో అందాల బాపుబొమ్మ

పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది సినిమాతో పాటు ఇంకా చాలా సినిమాల్లో నటించిన ముద్దుగుమ్మ ప్రణీత. ఈ అమ్మడు టాలీవుడ్ తో పాటు ఇతర భాషల సినిమాల్లో నటించినా కూడా ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు వచ్చినా కూడా కెరీర్ లో ఎక్కువ కాలం నిలదొక్కుకోలేక పోయింది. హీరోయిన్ గా ప్రణీత ప్రస్తుతం పెద్దగా సినిమాలు చేయకున్నా కూడా సోషల్ మీడియాలో మాత్రం రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తుంది. తాజాగా ఈ అమ్మడు థాయిల్యాండ్ లో హాలీడేస్ ను ఎంజాయ్ చేస్తుంది. తాజాగా అందుకు సంబంధించిన ఫోటోలు మరియు వీడియోలను



షేర్ చేసింది. థాయ్ లో తాము బస చేస్తున్న హోటల్ అందాలను చూపించడంతో పాటు అందమైన తన రూపం ను చూపిస్తూ ఫోటో షూట్ ను షేర్ చేసింది. ఆకట్టుకునే అందం ఈ అమ్మడి సొంతం అని మళ్లీ నిరూపించింది. బాత్ టబ్ లో ఈ అమ్మడు జలకాలాడుతూ షేర్ చేసిన ఫోటో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఇంకా కూడా ఈ అమ్మడు అత్తారింటికి దారేది సినిమాలో ఎలా అయితే కనిపించిందో ఇప్పటికి కూడా అలాగే కనిపిస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. పెళ్లి చేసుకుని తల్లి అయిన తర్వాత కూడా ప్రణీత ఇలా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం జరుగుతుంది. ముందు ముందు ప్రణీత మళ్లీ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇలాంటి ఫోటోలను చూస్తే అనిపిస్తుందని నెటిజన్స్ అంటున్నారు.




## మీర్జాపూర్ 3.. జెట్ స్పీడ్ లో ట్రెండింగ్ షురూ




ఓటీటీ వెబ్ సిరీస్ లో అత్యధిక మంది వీక్షించిన కంటెంట్ లలో మీర్జాపూర్ సిరీస్ ఉంటుంది. మీర్జాపూర్ సిటీ బ్యాక్ డ్రాప్ మాఫియా గొడవలు, ఆధిపత్య పోరు నేపథ్యంలో వచ్చిన ఈ వెబ్ సిరీస్ రెండు సీజన్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. రిలీజ్ అయిన అన్ని భాషలలో మీర్జాపూర్ రెండు సీజన్స్ సూపర్ హిట్ అయ్యాయి. ఇందులో కాస్త బూతులు ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అయిన వాటిని పబ్లిక్ కూడా ఇంట్రస్ట్ గా వీక్షించారు. అందుకే మీర్జాపూర్ సీజన్ 3ని కొద్ది రోజుల క్రితం ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చారు. ఇండియా నుంచి వచ్చిన వెబ్ సిరీస్ లో కంప్లీట్ కల్ట్ కంటెంట్ తో మీర్జాపూర్ ట్రెండ్ సెట్ చేసింది.

ఇదిలా ఉంటే తాజాగా రిలీజ్ అయిన మీర్జాపూర్ 3కి అద్భుతమైన స్పందన వస్తోంది. రిలీజ్ అయిన అతి తక్కువ టైంలోనే ఇండియాలో అత్యధిక మంది వీక్షించిన వెబ్ సిరీస్ గా మీర్జాపూర్ 3 నిలిచింది. ఈ విషయాన్ని అమెజాన్ ప్రైమ్ అధికారికంగా ప్రకటించింది. 180o దేశాల ప్రజలు ఈ మీర్జాపూర్ 3 వెబ్ సిరీస్ ని వీక్షిస్తూ ఉండగా 83 దేశాలలో టాప్ 10 ట్రెండింగ్ లో ఉందని తెలియజేశారు. మొదటి, రెండు సీజన్స్ తో పోల్చుకుంటే సీజన్ 3 ఆశించిన స్థాయిలో ప్రేక్షకులని మెప్పించలేదు. అయితే ఈ మీర్జాపూర్ సిరీస్ కి ఉన్న సక్సెస్ ట్రాక్ కారణంగా మీర్జాపూర్ 3ని కూడా అత్యధిక మంది వీక్షించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే మీర్జాపూర్ 3 వెబ్ సిరీస్ రిలీజ్ అయ్యి సక్సెస్ ఫుల్ గా నడవడంతో సీజన్ 4 షూటింగ్ కి కూడా స్టార్ట్ చేసేశారంట. దీనిని వచ్చే ఏడాది రిలీజ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా భాషలలో ఈ మీర్జాపూర్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. కంటెంట్ అన్ని ప్రాంతాలకి రిలేట్ అయ్యే విధంగా ఉండటంతో పాటు, రియలిస్టిక్ గా సంభాషణలు ఉండటం వలన ఈ సిరీస్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది.

అలాగే ఈ మీర్జాపూర్ వెబ్ సిరీస్ లో నటించిన యాక్టర్స్ కి కూడా స్టార్ ఇమేజ్ వచ్చింది. బోల్డ్ కంటెంట్ అయిన కూడా ప్రేక్షకులు ఆదరిస్తూ ఉండటంతో ఇదే తరహాలో సీజన్ 4ని కూడా రెడీ చేయబోతున్నట్లు తెలుస్తోంది. మరి మీర్జాపూర్ సీజన్ 3 లాంగ్ రన్ లో ఇండియన్ వెబ్ సిరీస్ ల పరంగా అత్యధిక వ్యూవర్ షిప్స్ రికార్డ్స్ ని ఏ స్థాయిలో క్రియేట్ చేస్తుందనేది వేచి చూడాలి.

## దేవర 2 కి మేకర్స్ ప్లాన్ అదేనా..?




ఆచార్య ఫ్లాప్ పడినా కొరటాల శివ మీద నమ్మకంతో దేవర ఛాన్స్ ఇచ్చాడు ఎన్.టి.ఆర్. అద్భుతమైన కథ రాసుకుని సెట్స్ మీదకు వెళ్లిన కొన్నాళ్లకే ఈ సినిమా ఒక పార్ట్ గా కాదు రెండు భాగాలుగా చెప్పాలని డిసైడ్ అయ్యారు. ఎన్.టి.ఆర్ దేవర రెండు భాగాలు అనగానే ఫ్యాన్స్ లో అంచనాలు మరింత పెరిగాయి. ఇక సినిమా నుంచి వస్తున్న టీజర్స్ అన్ని లెక్కకు మించి అన్నట్టు హైప్ తెస్తున్నాయి. దేవర సినిమా ప్రతి అభిమాని కాలర్ ఎత్తుకునేలా చేస్తుందని స్వయంగా తారక్ చెప్పడంతో అభిమానుల అంచనాలకు ఆకాశమే హద్దు అయ్యింది. అక్టోబర్ 10న దేవర ఆగమనం జరుగుతుంది. ఐతే దేవర మొదటి భాగం క్లైమాక్స్ కూడా సెకండ్ పార్ట్ కి అదిరిపోయే లీడ్ అవుతుందని అంటున్నారు. అంతేకాదు రెండో భాగం వెంటనే రిలీజ్ చేసినా చూసేయాలి అన్న ఎగ్జైట్ మెంట్ ఉంటుందట. దేవర 1 తో పాటుగా వార్ 2 షూటింగ్ లో పాల్గొంటున్న ఎన్.టి.ఆర్ 2025 లో దేవర 2 కి డేట్స్ ఇస్తాడని తెలుస్తుంది. ఈ ఇయర్ చివర్లో ప్రశాంత్ నీల్ తో చేయబోతున్న సినిమాకు డేట్స్ అడ్జెస్ట్ చేస్తున్నాడు. సో 2025 దేవర 2 ని ఎలాగోలా పూర్తి చేసి 2026 సంక్రాంతికి లేదా సమ్మర్ కి దేవర 2 ని రిలీజ్ ప్లాన్ చేస్తున్నారట.

అంతేకాదు దేవర 1 ఎండింగ్ కి దేవర 2 రిలీజ్ డేట్ చెప్పేస్తారని అంటున్నారు. దేవర మొదటి పార్ట్ మాత్రం దసరా బరిలో రికార్డులను టార్గెట్ పెట్టుకుని వస్తుంది. ఎన్.టి.ఆర్ లోని నట విశ్వరూపాన్ని మరోసారి ప్రేక్షకుల ముందు ఉంచేందుకు దేవర వస్తుందని చిత్ర యూనిట్ చెబుతున్నారు. RRR తర్వాత దేవర చేస్తున్న తారక్ గ్లోబల్ వైడ్ గా తనని అభిమానించే ప్రేక్షకులందరిని సర్ ప్రైజ్ చేస్తాడని అంటున్నారు. దేవర ప్రతి విషయంలో స్పెషల్ కేర్ తీసుకున్నారు. అనిరుద్ మ్యూజిక్ ఇప్పటికే సినిమాపై డబుల్ క్రేజ్ తీసుకు రాగా హీరోయిన్ గా జాన్వి.. విలన్ గా సైఫ్ ఇలా అన్ని అంశాల్లో ది బెస్ట్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. దేవర సినిమాతో దమ్ము చూపించేందుకు వస్తున్న ఎన్.టి.ఆర్ సినిమాతో మరోసారి బాక్సాఫీస్ షేక్ చేస్తాడని అంటున్నారు.

## చీరకట్టులో అనసూయ అందం.. స్టన్నింగ్ లుక్

తెలుగు బుల్లితెరపై యాంకర్ గా తిరుగులని ఇమేజ్ సొంతం చేసుకున్న అందాల భామ అనసూయ. ఈ బ్యూటీ న్యూస్ రీడర్ గా కెరియర్ స్టార్ట్ చేసి తరువాత జబర్దస్త్ కామెడీ షోద్వారా యాంకర్ గా బుల్లితెరపై ప్రస్థానం మొదలు పెట్టింది. అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా స్టార్ యాంకర్ గా అనసూయ తన ఇమేజ్ పెంచుకుంది. క్షణం సినిమాతో వెండితెరపైకి నటిగా అడుగుపెట్టి మొదటి సినిమాతోనే విమర్శకులు ప్రశంసలు సొంతం చేసుకుంది. రామ్ చరణ్ రంగస్థలం సినిమా అనసూయ కి ఏకంగా స్టార్ యాక్టర్ గా ఇమేజ్ తీసుకొచ్చింది. ఆ తర్వాత నటిగా వరుస అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతుంది. పుష్ప సినిమాలో కీలక పాత్రలో కనిపించిన అనసూయ ఆ చిత్రానికి సీక్వెల్ గా వస్తున్న పుష్ప ది రూల్ మూవీలో కూడా నటించింది. అలాగే మరికొన్ని సినిమాలు ఆమె చేతిలో ఉన్నాయి. కేవలం తెలుగులోనే కాకుండా ఇతర భాషలలో కూడా అనసూయ నటిగా మంచి అవకాశాలు సొంతం



చేసుకుంటుంది. అనసూయ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన ఇన్స్టాగ్రామ్ లో అప్డేట్స్ షేర్ చేస్తూ వస్తోంది. ముఖ్యంగా తన ఫ్యామిలీతో కలిసి వెళ్లే వెకేషన్ కి సంబంధించిన ఫోటోలను అనసూయ షేర్ చేస్తూ ఉంటుంది. అలాగే తనపైన ఎవరైనా వ్యక్తిగతంగా విమర్శలు చేస్తే వెంటనే ఇన్స్టాగ్రామ్ లో రియాక్ట్ అవ్వడం అనసూయ నైజం. అనసూయ ముక్కుసూటిగా తనదైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తూ విశేషంగా అభిమానులను సొంతం చేసుకుంది. అలాగే ఎప్పటికప్పుడు గ్లామరస్ ఫోటోలను కూడా ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ ఉంటుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ బ్యూటీ అనంతపురంలో సౌత్ ఇండియన్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వెళ్ళింది. ఈ సందర్భంగా అక్కడ దిగిన ఫోటోలను అనసూయ ఇన్స్టాగ్రామ్ లో పంచుకుంది. ఈ ఫోటోలలో చక్కని చీరకట్టుతో అందంగా ముస్తాబై అనసూయ కనిపించడం విశేషం. ఆమె లుక్స్ ఫ్యాన్స్ ని సర్ప్రైజ్ చేస్తున్నాయి. హీరోయిన్స్ కి సైతం పోటీ ఇచ్చే అందంతో అనసూయ ఈ ఫోటోలలో మెరిసిపోతోందనే మాట నెటిజన్ల నుంచి వినిపిస్తోంది. అందానికి ఆభరణంగా ఆమె రూపం ఉందని ఫ్యాన్స్ పొగుడుతూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోలు కాస్త ఇప్పుడు వైరల్ అయ్యాయి. ఇక ప్రస్తుతం అనసూయ పుష్ప 2 సినిమాతో పాటు మరో రెండు సినిమాలతో బిజీగా ఉంది. అలాగే వెబ్ సీరీస్ లలో కూడా నటిస్తోంది.

## అందాల సమంత కొత్త అందం

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత అనారోగ్య కారణంగా గత ఏడాది కాలంగా కొత్త సినిమాలు చేయడం లేదు. ఏడాది పాటు షూటింగ్స్ కు పూర్తిగా దూరంగా ఉన్న సమంత ఎట్టకేలకు కెమెరా ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. ఖుషి సినిమా తర్వాత సమంత నుంచి రాబోతున్న సినిమా కోసం ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. సినిమాల్లో హీరోయిన్ గా నటించకున్నా కూడా ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూనే ఉంది. షూటింగ్స్ కు ఏడాది బ్రేక్ తీసుకున్న సమయంలో కూడా సమంత ఫోటో షూట్స్ తో ఆకట్టుకుంది. తాజాగా ఈ ఫోటోలను సమంత ఇన్ స్టా లో షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. సమంత ఈ మధ్య కాలంలో మరింత అందంగా తయారు అయ్యిందని ఫ్యాన్స్ మరియు నెటిజన్స్ ఈ ఫోటోలను తెగ



షేర్ చేస్తున్నారు. నెట్టింట సమంత ఫోటోలు ఎప్పటిలాగే వైరల్ అవుతున్నాయి. సమంతకు సంబంధించిన ఏ ఫోటోలు షేర్ చేసినా కూడా అవి ఫ్యాన్స్ మరియు నెటిజన్స్ దృష్టిని ఆకర్షించడం, అందరూ వాటిని షేర్ చేయడం మనం చూస్తూ ఉన్నాం.

తాజాగా ఈ ఫోటోలను కూడా నెటిజన్స్ తెగ షేర్ చేస్తున్నారు. ప్రస్తుతం సమంత 'బంగారం' సినిమాలో నటిస్తుంది. ఇప్పటికే విడుదల అయిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. గన్ పట్టుకుని ఉన్న సమంత పోస్టర్ ను సోషల్ మీడియా ద్వారా ఒక్కసారిగా హైప్ క్రియేట్ చేశారు. ఈ ఏడాదిలోనే వెబ్ సిరీస్ మరియు సినిమాతో సమంత ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.




## బీఆర్ఎస్ పని అయిపోయినట్టేనా.. కాంగ్రెస్‌లోకి 20 మంది ఎమ్మెల్యేలు..!?

బీఆర్ఎస్ పార్టీని చేరికలు కుదిపేస్తున్నాయి..! ఎంతలా అంటే.. ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి..! తెలంగాణ సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్‌లోకి మొదలైన జంపింగ్‌లు.. కొనసాగూతూనే ఉన్నాయి. దీంతో ఇవాళ బీఆర్ఎస్‌లో ఉన్న సిట్టింగ్‌లు, కీలక నేతలు రేపు ఏ పార్టీలో చేరిపోతారో తెలియని పరిస్థితిలో హైకమాండ్ ఉంది..! ఒక్కొక్కరుగా పార్టీకి గుడ్ బై చెబుతుండటంతో 'కారు' పూర్తిగా ఖాళీ అయ్యే అవకాశాలు మెండుగానే కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఆఖరికి ఆ నలుగురే గులాబీ పార్టీలో మిగులుతారనే చర్చలు గట్టిగానే నడుస్తున్నాయి.

**ఏం జరుగుతోంది..? :** జులై నెలాఖరులోగా కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ఎల్పీ విలీనమే టార్గెట్‌గా సీఎం రేవంత్ రెడ్డి పెట్టుకున్నారనే టాక్ రాష్ట్ర రాజకీయాల్లో గట్టిగా నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 39 మంది ఎమ్మెల్యేలు గెలిచిన సంగతి తెలిసిందే. ఇక కంటోన్మెంట్ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలుపుతో 38కి బీఆర్ఎస్ బలం తగ్గిపోయింది. ఇక ఇప్పటి వరకూ 9 మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల బలం 73కు చేరుకుంది. అయితే.. మరో 20 మంది ఎమ్మెల్యేలు, 10 మంది ఎమ్మెల్సీలు క్యూలో ఉన్నట్లుగా తెలుస్తోంది.

**గ్రేటర్‌లో ఖాళీ! :** మొత్తం 29 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరితే బీఆర్ఎస్ఎల్పీ విలీనం పూర్తి అవుతుంది. శుక్రవారం నాడు బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, ఇవాళ అరికెపూడి గాంధీ కాంగ్రెస్ కండువాలు కప్పేసుకున్నారు. ఇక మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి సహా పలువురు గ్రేటర్ హైదరాబాద్ ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

## ఇంజినీరింగ్ కళాశాలలకు సాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధం: సీఎం రేవంత్



హైదరాబాద్: ఇంజినీరింగ్ కళాశాలలకు సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన 'నాణ్యమైన ఇంజినీరింగ్ విద్య' కార్యక్రమంలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. "దేశంలో మొదటి సారిగా ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని ప్రవేశ పెట్టింది కాంగ్రెస్ పార్టీ. జేఎన్‌టీయూ పరిధిలో కళాశాలలు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రభుత్వ విధానం తెలవాలి. ప్రభుత్వ విధానాలు అందరికీ తెలిసే విధంగా ప్రస్తుత కార్యక్రమం ఏర్పాటు చేశాం. ప్రతి విషయంలో ప్రభుత్వ విధానం కీలకం. ఈ విద్యాసంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు లేకుండా చూస్తాం. నిరుద్యోగులను తయారు చేసే పరిశ్రమలుగా కళాశాలలు ఉండ కూడదు. అభివృద్ధి చెందుతున్న దేశానికి అత్యంత అవసరమైంది సివిల్ ఇంజినీరింగ్. కొన్ని కళాశాలల్లో సివిల్ ఇంజినీరింగ్‌ను లేకుండా చేసే విధంగా ప్రణాళికలు చేస్తున్నారు. కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులను కచ్చితంగా నడపాలి. ఈ కోర్సులు లేకపోతే దేశం ప్రమాదాన్ని ఎదుర్కొంటుంది.

**స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం..** గత సీఎంలు తీసుకున్న విధానాల వల్ల మనం ఐటీ, ఫార్మా రంగాల్లో ముందున్నాం. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కోర్సులు ఉండాలి. ఫార్మా, ఐటీ తర్వాత ఏఐ ప్రపంచాన్ని నడిపించబోతోంది. రాష్ట్రంలోని కళాశాలల్లో ఏఐకి సంబంధించిన కోర్సు ప్రవేశపెట్టాలి. ప్రభుత్వం కూడా అందుకు ప్రోత్సహిస్తుంది. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి అటానమస్ హోదా ఇస్తాం. పక్క రాష్ట్రాలతో పోటీ పడే విధంగా కాకుండా ప్రపంచంతోనే పోటీ పడే విధంగా మనం తయారు కావాలి. మా ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోంది. అందుకోసం ప్రణాళికలు సిద్ధం చేస్తుంది" అని సీఎం వివరించారు. మంత్రి శ్రీధర్‌బాబు, జేఎన్‌టీయూ వీసీ బుర్రా వెంకటేశం, ఇంజినీరింగ్ కాలేజీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

## అద్భుత సదుపాయాలతో సిద్ధమైన చర్లపల్లి రైల్వేస్టేషన్.. ఫొటోలు షేర్ చేసిన కేంద్ర మంత్రి






హైదరాబాద్: జంట నగరవాసులకు త్వరలో మరో రైల్వేస్టేషన్ అందుబాటులోకి రాబోతోంది. చర్లపల్లి రైల్వే టర్మినల్ నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. ఎన్నికలకు ముందే ప్రారంభం కావాల్సిన ఈ స్టేషన్.. త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ఈనేపథ్యంలో చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు సంబంధించిన చిత్రాలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తాజాగా ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సుమారు రూ.434 కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకున్న ఈ రైల్వేస్టేషన్ తెలంగాణలో నాలుగో అతిపెద్ద రైల్వేస్టేషన్ కాబోతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 98 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. 9 ప్లాట్‌ఫామ్‌లు కలిగిన ఈ స్టేషన్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లలో రద్దీ తగ్గుతుందని పేర్కొన్నారు. సుదూర ప్రాంత రైళ్లు, ఎంఎంటీస్ రైళ్ల మధ్య మారడానికి ఈ స్టేషన్ వీలు కల్పిస్తుందన్నారు. మరోవైపు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునర్నిర్మాణ పనులు జరుగుతున్నవేళ.. ఈ రైల్వే స్టేషన్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## తెలంగాణకు రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఎప్పుడిస్తారు..?: మాజీ ఎంపీ వినోద్



హైదరాబాద్: తెలంగాణకు రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఎప్పుడిస్తారని మాజీ ఎంపీ వినోద్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో భాజపాకు ఎనిమిది ఎంపీలున్నారు. వారిలో ఇద్దరు కేంద్రమంత్రులు. తెలంగాణకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కావాలని ఎప్పటి నుంచో అడుగుతున్నాం. విభజన చట్టంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ప్రస్తావన ఉంది. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి ఇవ్వాల్సినవి ఇవ్వాలి. పదేళ్లలో భారాస ఈ విషయంపై పార్లమెంటులో చాలా సార్లు మాట్లాడింది. కేసీఆర్ ప్రధాని నరేంద్రమోదీని కలిసి కూడా మాట్లాడారు. వ్యాగన్ రిపేర్ ఫ్యాక్టరీ ఇచ్చి కోచ్ ఫ్యాక్టరీ ఇచ్చినట్లుగా చెబుతున్నారు.

అదో చిన్న పరిశ్రమ. ఏపీకి రూ.60 వేల కోట్లు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం. అక్కడో ప్రాంతీయ పార్టీని గెలిపించినందుకే అవన్నీ వచ్చాయి. చంద్రబాబు, తెదేపా అవసరం ఉంది కాబట్టే మోదీ అలా చేశారు. తెలంగాణకు కూడా ఇవ్వాల్సినవి తప్పకుండా ఇవ్వాలి. అందరినీ సమానంగా చూడాల్సిన భాజపా ఇచ్చిన హామీని ఎందుకు నిలబెట్టుకోవడం లేదు" అని వినోద్ ప్రశ్నించారు.

## వచ్చే ఎన్నికల్లో వారికి ప్రజలే బుద్ధి చెబుతారు



హైదరాబాద్: సంవిధాన్ హత్యా దివస్‌గా జులై 25ను ప్రకటించడం చూస్తుంటే కాంగ్రెస్‌ను చూసి బీజేపీ ఏ విధంగా భయపడుతుంతో అర్థం చేసుకోవచ్చని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానిగా మోడీ ఎన్నికైనా.. గెలుపు మాత్రం కాంగ్రెస్?దే అన్నట్లు ప్రజలు అభిప్రాయపడుతున్నారని ఆయన చెప్పారు. బీజేపీ నేతల ముఖంలో సంతోషం కనిపించడం లేదని, అందుకే వారు కాంగ్రెస్ మీద దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో వివిధ రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో వాళ్లకి ప్రజలే బుద్ధి చెబుతారని ధ్వజమెత్తారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించిన సమయంలో ఆర్ఎస్ఎస్, శివసేన బాల్ ఠాక్రే కూడా సమర్థించారని ఆయన గుర్తు చేశారు. ఎమర్జెన్సీ అనంతరం బహిరంగ సభలో ఇందిరా గాంధీ విచారం వ్యక్తం చేస్తూ ఆ తీవ్రత బాధ్యత తానే తీసుకుంటా అని ప్రకటించారని నిరంజన్ చెప్పారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జనతా పార్టీని ప్రజలు చిత్తుగా ఓడించి ఆమెను మరోసారి ప్రధానిని చేశారని ఆయన తెలిపారు. జనవరి 14ను ప్రజాస్వామ్య పునర్నిర్మాణ దివస్‌గా జరుపుకోవాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ పిలుపునిచ్చారు.




## హైదరాబాద్ యాత్రికుల బస్సు ప్రమాదం.. ముగ్గురి మృతి

హైదరాబాద్: హైదరాబాద్ నుంచి యాత్రికులతో బయలుదేరి ఒడిశా వెళ్లిన ఓ బస్సు ప్రమాదానికి గురైంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ పాతబస్తీలోని ఛత్రినాక ప్రాంతానికి 23 మంది తీర్థయాత్ర నిమిత్తం ఒడిశా వెళ్లారు. బరంపురం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న బస్సును మరో ట్రావెల్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులను ఉదయ్‌సింగ్, క్రాంతిభాయ్, ఉప్పలయ్యగా గుర్తించారు. మరో 20 మందికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.




## రాజ్‌తరుణ్ కేసులో ట్విస్ట్.. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ సందేశం పంపిన లావణ్య

హైదరాబాద్: సినీ నటుడు రాజ్‌తరుణ్ తనను ప్రేమించి మోసం చేశాడంటూ లావణ్య అనే యువతి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో ఆమె శుక్రవారం అర్ధరాత్రి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తన అడ్వొకేట్‌కు సందేశం పంపించింది. తాను వెళ్లిపోతున్నానంటూ అందులో పేర్కొంది. దీంతో స్పందించిన అడ్వొకేట్ డయల్ 112 ద్వారా నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు అర్ధరాత్రి లావణ్య ఇంటికి వెళ్లారు. ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేనేంటో తెలిసిన వారే నన్ను తప్పుబట్టారని లావణ్య తాను పంపించిన సందేశంలో వాపోయింది. "రాజ్ లేని లైఫ్‌లో నేను ఉండలేను.. బతకలేను. అన్నీ కోల్పోయాను.

అందరి వల్ల నేనే మోసపోయాను. రాజ్ తల్లిదండ్రులు కూడా నా చావుకు కారణం. రాజ్ మొత్తం మారిపోయాడు, నా చావును కోరుకున్నాడు. మాల్వీ మల్హోత్ర నా చావుకు ప్రధాన కారణం. నా కుటుంబం, దిలీప్ సుంకర, మీడియాకు నా క్షమాపణలు" అంటూ లావణ్య అడ్వొకేట్‌కు సందేశం పంపించింది.

## త్వరలో అన్ని జిల్లా కేంద్రాలకు ఏసీ బస్సులు: మంత్రి పొన్నం ప్రభాకర్




నల్గొండ: రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన బస్సులను ప్రారంభించారు. నల్గొండ-హైదరాబాద్ మధ్య నాన్‌స్టాప్ ఏసీ, 3 డీలక్స్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కొత్తగా 1000 బస్సులు కొన్నామని, మరో 1500 బస్సులకు ఆర్డర్ ఇచ్చినట్లు చెప్పారు. దసరా లోపు నల్గొండ జిల్లాకు 30 ఎక్స్‌ప్రెస్, 30 లగ్జరీ బస్సులు ఇస్తామని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం డీఏ ఇచ్చామన్నారు. రూ.280 కోట్ల బకాయిల్లో రూ.80 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. మిగిలిన రూ.200 కోట్లను నెలాఖరులోగా చెల్లిస్తామని తెలిపారు. ఆర్టీసీలో 3,035 ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రం నుంచి లగ్జరీ బస్సులు నడుపుతామన్నారు. అన్ని జిల్లా కేంద్రాల నుంచి ఏసీ బస్సులు ప్రారంభిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. త్వరలో నల్గొండ జిల్లాకు మరిన్ని బస్సులు తెస్తామన్నారు. కొత్త బస్సుల్లో నల్గొండకు 100 కేటాయించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.




రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో సంచలనం సృష్టించిన హత్యకేసు చిక్కుముడి వీడింది. రియల్టర్ కమ్మరి కృష్ణను అతడి కుమారుడే హత్య చేయించినట్లు పోలీసులు నిర్ధరించి నిందితుడిని అరెస్టు చేశారు. అతడు మొదటి భార్య కుమారుడని పోలీసులు తెలిపారు. ఆస్తి మొత్తం మూడో భార్యకు రాసిస్తున్నాడనే కక్షతో ఈ దారుణానికి ఒడిగట్టాడని పేర్కొన్నారు. రూ.25 లక్షల సుపారీ ఇచ్చి ముగ్గురితో హత్య చేయించినట్లు వివరించారు. నిందితుల నుంచి 3 కత్తులు, 2 కార్లు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నారు.

**అసలేమైందంటే..** గండిపేట మండలం హైదర్షాకోట్‌కు చెందిన కమ్మరి కృష్ణ (55) స్థిరాస్తి వ్యాపారి. ఆయనకు షాద్‌నగర్ పరిధి కమ్మదనంలో ఫాంహౌస్ ఉంది. ఈ నెల 10వ తేదీన కృష్ణ మూడో భార్య పావనితో కలిసి అక్కడికి వెళ్లాడు. అదను కోసం చూస్తున్న కృష్ణ వ్యక్తిగత సహాయకుడైన బాబాతోపాటు మరో ఇద్దరు చాకుతో కృష్ణ గొంతుకోసి పరారయ్యారు. అతని అరుపులు విని పైఅంతస్తులో ఉన్న భార్యవచ్చి కృష్ణను శంషాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడు. కృష్ణ దగ్గర బాబా వ్యక్తిగత సహాయకుడిగా కొన్నేళ్లుగా పనిచేస్తుండగా ఏడాది క్రితం అతడిని తొలగించారు. సరిగా పనిచేస్తానంటూ కృష్ణను బతిమాలడంతో కొద్ది రోజుల క్రితమే విధుల్లోకి తీసుకున్నారు. కృష్ణ ఫాంహౌస్‌కు వెళ్లిన విషయం తెలుసుకున్న బాబా ఫోన్ ఛార్జింగ్ పెట్టాలని అక్కడికి వచ్చాడు. కొంతసేపటికి మరో ఇద్దరు వచ్చారు. ఇద్దరు కృష్ణ కాళ్లు చేతులు పట్టుకోగా మరొకరు గొంతు కోసి హతమార్చారు. మృతుడు కృష్ణకు రూ.వంద కోట్లకుపైగా ఆస్తులున్నాయి. ఇతని మొదటి భార్యకు ఇద్దరు కుమారులున్నారు. మూడో భార్య సంతానం మొదటి పుట్టినరోజు వేడుకలు 4 నెలల క్రితం నగరంలో చేశారు.

## సికింద్రాబాద్‌లో తలసాని పర్యటన.. బోనాల ఏర్పాట్లపై ఏమన్నారంటే?



హైదరాబాద్, జూలై 13: భాగ్యనగరంలో బోనాల సందడి షురూ అయ్యింది. గోల్కొండ అమ్మవారికి బోనమెత్తడంతో ఉత్సవాలు మొదలయ్యాయి. అలాగే ఈనెల 21న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం సికింద్రాబాద్‌లో పర్యటించారు. మహంకాళి ఆలయం వద్ద అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈనెల 21 సికింద్రాబాద్ మహంకాళీ అమ్మవారి బోనాలు, 22న రంగం (భవిష్యవాణి) జరుగనుందని తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాదిమంది భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాలు ఉత్సవాలను రాష్ట్ర పండుగగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారన్నారు. దీంతో దేశ వ్యాప్తంగా బోనాల ఉత్సవాల విశిష్టత మరింత పెరిగిందన్నారు. అందరి భాగస్వామ్యంతో అత్యంత ఘనంగా బోనాల ఉత్సవాలు జరుగుతాయని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com